honeybee.org

Vol-13 Issue-4
వెల : రూ. 20/-

సంపుటి 13 సంచిక 4 జులై - ఆగస్టు 2025

# పల్లెసృజన

www.pallesrujana.org

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





## 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత "చింతకింది మల్లేశం" మరో ఇన్నోవేషన్

# చేనేత కార్మికుల కోసం "పెద్ద ఆసు యంత్రం" ప్రారంభోత్సవం





'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చి, 'పద్మశ్రీ' మపురస్కారం పొందిన చింతకింది మల్లేశం ఇటీవల పోచంపల్లి చేనేత కార్మికులు గత కొన్ని దశాబ్దాలుగా 'ఆసు పోయటం' అనే కష్టమైన పనిని చెయ్యలేక అంతరించి పోబోతున్న పోచంపల్లి చేనేత పరిశ్రమను 'లక్ష్మీ ఆసు యంత్రం' తయారు చెయ్యటంతో ఆ రంగం మళ్ళీ పునరుజ్జీవింపబడి, పోచంపల్లి చేనేత కార్మికు జీవితాల్లో వెలుగును నింపాడు. మళ్ళీ ఇప్పుడు 'పెద్ద ఆసు' చీరలకు గిరాకీ పెరగటంతో ఇంతవరకు నేస్తున్న ఆసు చీరలకు మార్కెట్‌లో విలువ తగ్గిపోయింది. ఈ సమస్య నుండి కూడా తన చేనేత రంగ కుటుంబాలు మళ్ళీ నిరుత్సాహానికి గురి కాకుండా "పెద్ద ఆసు యంత్రం" తయారు చేశాడు. ఈ యంత్రాన్ని 7 ఆగస్టు, 2025న 'జాతీయ చేనేత దినోత్సవం' సందర్భంగా తెలంగాణ రాష్ట్ర చేనేత జౌళి శాఖామాత్యులు శ్రీ తుమ్మల నాగేశ్వర రావు గారి చేతుల మీదుగా మల్లేశం 'బిగ్ ఆసు మిషన్'ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం తెలంగాణ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీమతి శైలజా రామయ్యర్ గారి ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

- ఎడిటర్

Vol-13, Issue - 4 July-Aug 2025



సంపుటి-13 సంచిక - 4 జులై-ఆగస్టు 2025

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

## ఈ సంచికలో.....

* 'ఉపాధి కల్పన'కు నిలువెత్తు నిదర్శనమైన యువకుడు 'చెరిపెల్లి రాము' - 4
* 'అడవితో ఆనందం' పల్లెసృజన బృందం నల్లమల అడవిలో విత్తన బంతులు చల్లే కార్యక్రమం - 7
* 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 9
* '49వ జాతీయ శోధయాత్ర - తూర్పు ఉత్తర ప్రదేశ్ నుంచి అసాధారణ సందేశం - చివరి భాగం - 12
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 14
* యువత అవగాహనకై పకృతిలో లభించే చెట్ల పేర్లు సంస్కృతం మరియు తెలుగు భాషల్లో - 18
* డా. ఎపిజె అబ్దుల్ కలామ్ చిన్నపిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు - 2023 - 20
* పల్లె జ్ఞానం - 24
* ఎన్ఐఎఫ్ వారి 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్-2023) పురస్కారాలు - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32

**కవర్ లోపలి పేజీల్లో ...**

చింతకింది మల్లేశం 'పెద్ద ఆసు యంత్రం' ప్రారంభోత్సవం

**మధ్య పేజీలో :**

జులై – ఆగస్టు 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# వ్యవసాయం - రైతుల పట్ల సమాజ వైఖరి



సాంప్రదాయ వ్యవసాయంలో రైతు పంటను జీవన భృతిగా చూసేవారు. తన కుటుంబానికి, తన పశువులకు సంవత్సరమంతా సరిపోతే తృప్తి పడేవారు. ధాన్యంతో (వచ్చిన పంటలతో) తన కుటుంబానికి కావలసిన అవసరాలను సంపాదించుకునేవారు. ద్రవ్యం వాళ్ళ జీవితాల్లో ఉండేది కాదు. పంట పండించడమంటే బ్రతుకుటకే అన్న విశ్వాసం, ధ్యేయం ఉండేది. తనకు కావలసింది తీసుకుని మిగతా షావుకారుకు ఇచ్చేవారు.

దేశ పరిపాలనా వ్యవస్థ ప్రధానంగా స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి రైతుల జీవన విలువలు, విధానాల్లో ఎన్నో మార్పులు తెచ్చింది. దేశ పరిపాలనకు అవసరమైన పద్ధతులను, పాలసీలను అమలులోకి తెచ్చింది. సైన్సు ఆధారిత వ్యవసాయం, దానికి తోడు మార్కెట్‌లో వస్తున్న వ్యాపార ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం, కార్పొరేట్ల ధనాశ, ప్రపంచీకరణ, ఇవన్నీ మెల్లి మెల్లిగా రైతు జీవన విధానాన్ని పూర్తిగా మార్చివేశాయి. అధిక ఉత్పత్తి, ద్రవ్యలాభం రైతుల ధ్యేయంగా నిలిచింది. స్థానికతను మరచి, సహజత్వానికి దూరంగా సాంకేతికత, శాస్త్ర జ్ఞానానికి ఉన్నత స్థానం ఇచ్చి రైతులను మభ్యపరచి, భారీ నష్టాలకు కారణమయ్యారు. దేశ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారు. వాతావరణ కాలుష్యం అతిగా చేసారు. కార్పొరేట్ సంస్థల స్వార్థం, వారికి తోడుగా రాజకీయ వ్యవస్థలు, ప్రభుత్వ దృష్టిని రైతులపై నుండి ధనం వైపు మరలించాయి. ధనం - లాభం కేంద్రంగా నిర్ణయాలు జరిగాయి. పాలసీలు తయారు చేయబడ్డాయి. రైతుల సహజ జ్ఞానానికి, సాంప్రదాయ పద్ధతులకు విలువ లేకుండా పోయింది. తరతరాలుగా ఆచరిస్తున్న ప్రకృతితో సంయమనం, సహజంగా ప్రకృతి వరంగా వచ్చే పునరోత్పత్తులు, పండించని పంటలు.... మాయమైపోయాయి. ఖర్చుతో కూడిన వ్యవసాయం సాంకేతికత అతి వినియోగం, స్థానికతను మరవడం, బయటి శక్తులపై అతిగా ఆధార పడటం..... ఇవన్నీ రైతులను అగమ్యగోచరంగా తయారు చేసాయి. తరతరాల జ్ఞానం నిర్లక్ష్యం చేశారు. శాస్త్రీయ పరమైన జ్ఞానం అతకటం లేదు. వ్యవస్థ రైతులను త్రిశంకు స్వర్గంలోకి పూర్తి తోసేసింది. దీనికి తోడు వ్యవసాయ ఎగుమతులకు తోడు చేయుని, వీటికై ప్రోత్సాహకాలు ప్రభుత్వాలు, కార్పొరేట్లు విరివిగా ఇవ్వడం ప్రారంభించాయి. ఎగుమతులు అంటే అనేక ఆంక్షలు. రైతులకు ఎగుమతుల పేరిట ఆశలు చూపెట్టి ఆంక్షలను అమలు చేయుటంలో వారి తల తోకకు వచ్చేట్టుగా పరిస్థితి తయారైంది.

గత 4-5 సంవత్సరాలుగా ప్రభుత్వం సహజ - సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నది. వ్యవసాయ పాలసీలు ఈ రెండు రకాల వ్యవసాయ పద్ధతులపైనే జరగాలని నిర్ణయించబడింది. అయితే రసాయనిక వ్యవసాయానికి అలవాటు పడ్డ మన రైతన్నలకు శ్రమతో కూడుకున్న ఇతరులపై ఆధార పడకుండా తమకు తామే తయారు చేసుకుని వ్యవసాయం చేయడం అసాధ్యంగా ఉంది. దానికి తోడు తగిన శిక్షణ, పరిజ్ఞానం లేదు. వారికి చెప్పేవారు, మార్గదర్శకం చేసేవారెవరూ లేరు. మరలా ఆయోమయ పరిస్థితితో పడ్డారు మన రైతులు.

ఈమధ్య ఒక వేదికపై సుభాష్ పాలేకర్ గారిని ముఖ్యమంత్రిగారు సన్మానిస్తూ సేంద్రియ వ్యవసాయంపై అందరూ దృష్టి సారించాలని, అది భవిష్యత్తుకు ఆనంద, ఆరోగ్యదాయకమని మార్గదర్శకత్వం చేసారు. వెంటనే పాలేకర్ గారు సహజ వ్యవసాయాన్ని బలపరుస్తూ సేంద్రియ

వ్యవసాయాన్ని తీవ్రంగా విమర్శించారు. ఒకే వేదికపై అత్యున్నత స్థాయిలో ఇలాంటి వ్యతిరేక అవగాహనలు ఉంటే పునాది స్థాయిలో ఉన్న రైతులు ఈ వ్యవసాయ పాలసీని ఎలా అమలు పర్చగలరు?

రైతులను తప్పుదోవ పట్టించి, వారిని అష్టకష్టాలు పెడుతూ మొసలి కన్నీరు కార్చే ఈ వ్యవస్థ, రైతులను కించ పరుస్తూ, మీరే తప్పని, రసాయనాలతో ప్రజల ఆరోగ్యాలు పాడవుతున్నాయని రైతులను దుయ్యబడుతున్నారు. వారికి పాఠాలు చెబుతున్నారు. నేర్చుకోవలసిన వాళ్ళు రైతులు కాదు వ్యవస్థ. రాజకీయ నాయకులు, కార్పోరేట్‌లు, మేధావులు, శాస్త్రవేత్తలు, మీడియా.... నిర్ణయాధికారాలు వీరివే కాబట్టి, వీళ్ళ తప్పులు ఎవరు వేలెత్తి చూపరు. రైతు సంఘాలు లేవు. కొన్ని ఉన్నా రాజకీయాలకు, కార్పోరేట్లకు దాసోహం అంటూ ఉంటాయి. జవాబుదారీతనం (అకౌంటబులిటీ) రైతుది కాదు, వ్యవస్థది. మారాల్సింది రైతు కాదు వ్యవస్థ దిశ, గమ్యం. రైతు పెరుగుదల, రైతు సంక్షేమ ఆధారిత వ్యవసాయ పాలసీ మారాలి.

వ్యవసాయం అతి ప్రధాన వృత్తి. అత్యవసరం. దీనికి ప్రత్యామ్నాయం లేదు. పండించాల్సిందే. అప్పుడే దేశం మిగతా రంగాలలో అభివృద్ధి చెందుతుంది. అయితే ఇలాంటి అనివార్య రంగానికి భవిష్యత్తులో కావాల్సిన రైతులు, వ్యవసాయమే వృత్తి (కెరీర్)గా చేసుకునే యువతను మనం చిన్నప్పటి నుండి తయారు చేస్తున్నామా? ఇంజనీరింగు కాలేజీలు ఇంజనీర్లను, వైద్య కళాశాలలు వైద్యులను, న్యాయ విద్యాలయాలు లాయర్లను తయారు చేస్తుంటే, వ్యవసాయ కళాశాలలు రైతులను ఎందుకు తయారు చేయడం లేదు? ఈ అభావంతో భవిష్యత్తులో ప్రజలకు ఆహారం ఎవరు పండిస్తారు? ఈ సమస్యను ఎక్కడా చర్చించరేం?!

దేశ వ్యవస్థలో విద్యావిధానం పరిపాలనా శాఖ, వైద్యశాఖ, రవాణా శాఖ లాంటి అనేక ప్రధాన భాగాలున్నాయి. వీటన్నిటినీ నడిపించటానికి మానవ వనరులు తయారు చేస్తారు. సౌకర్యాలు తోడు చేస్తారు. గమ్యాలు, దిశలు నిర్ణయిస్తారు. వారికి తగినంత జీతాలు, పదోన్నతులు లభిస్తాయి. అయినా పై శాఖల్లో అవినీతి, అసమర్థత, లక్ష్యసాధనలు కనిపించవు. కాని రైతులకు ఏమీ ఇవ్వకుండా, నెలజీతాలు లేకుండా, సాంకేతిక సహాయాలు అంతంత మాత్రంగా చేస్తూ రైతులను చేతకాని వాళ్ళుగా చూడటం, వారిని అన్ని నష్టాలకు బాధ్యులను చేయడం ఎంత వరకు న్యాయం?

దేశం ఆరోగ్యంగా ఉండాలంటే, వచ్చే తరాలకు ప్రకృతిలోని వనరులు వారసత్వంగా ఇవ్వాలంటే, ప్రకృతే ఆధారంగా జీవన వృత్తిగా సాగించే రైతులకు మార్గదర్శకత్వం సరళంగా, సహజంగా, మానవ కేంద్రిత ప్రత్యామ్నాయాలు వారికై నిర్వచించాలి. అవగాహన పెంచాలి. వారికి సంపూర్తిగా తోడుండాలి. వారి శక్తులను గుర్తించి, వాటిని అధికం చేయాలి. రైతుగా జీవించటం ఒక వృత్తిగా స్కూలు, కాలేజీల్లోనే తయారు చేయాలి. ప్రతి రైతు కావాలన్న యువతకు కొన్ని ఎకరాల భూమి, తగినన్ని వనరులు సమీకరించాలి. రైతు వ్యవసాయ జీవనం మిగతా వృత్తిపరమైన ఇంజనీర్లు, డాక్టర్ల కోవతో సమానంగా సమాజంలో గౌరవం వ్యవస్థ పరంగా ఇవ్వాలి.

రైతులను చదువుకోలేదన్న న్యూనతా భావంతో ఎంతమాత్రం ఎవరూ చూడకూడదు. అలాంటి ప్రవర్తన మనల్ని మనమే కించ పరచుకోవడం లాంటిది. పల్లెసృజన అనుభవంలో గ్రామాల్లో, గ్రామ ప్రజల్లో అపార జ్ఞానం ఉంది. అది దేశ అభ్యున్నతికి, ప్రజల క్షేమానికి, ధనార్జనకు, విద్య వైద్య సౌకర్యాలకు ఎంతగానో సహకరిస్తుంది. గత 20 సంవత్సరాల్లో పల్లెసృజన పొందిన అనుభవం ఇది. సముపార్జించిన జ్ఞానమది. ఆత్మనిర్భరతకు సాధ్యమది.

వానాకాలం పంటలు మీ అందరినీ సుఖశాంతులతో నింపాలని మనసారా కోరుకుంటూ....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

**"పల్లెసృజన విశ్వాసం"**

❖ రైతులు గ్రాహకులు కాదు సమకూర్చేవారు (ప్రొవైడర్స్) ❖ ఊళ్ళు అంతులేని బావులు కాదు - అవి ఆధారాలు (సోర్స్)

# 'ఉపాధి కల్పన'కు నిలువెత్తు నిదర్శనమైన యువకుడు
# చెరిపెల్లి రాము



- వీరరాఘవ రెడ్డి

ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో పారిశ్రామికవేత్తలు యువతకు ఉపాధి కల్పించటం కోసం కోట్లాది రూపాయలు పెట్టుబడిగా కేటాయించిన విషయం మనం గమనిస్తూనే ఉన్నాం. పరిశ్రమలకు ఎన్నో రాయితీలు ఇచ్చి, వాటి ద్వారా మన రాష్ట్రాల్లోని యువతకు ఉపాధి లభించేలా చెయ్యాలని ఎంతో కష్టపడుతూ ఉన్న విషయమూ మనకు తెలిసిందే. కానీ, వీటన్నిటికి భిన్నంగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి బావోలేక, కేవలం 5వ తరగతితో చదువు మానేసి, ఇతరుల వద్ద ఉద్యోగంలో చేరి, తన నేర్పరితనంతో ఆ ఉద్యోగంలోనే మెళకువలను తెలుసుకుని, అందులోనే ప్రతిభను సాధించి, రూపాయి పెట్టుబడి లేకుండా స్వంత వ్యాపారం మొదలు పెట్టి...... అలా... అలా.... ఎదిగి ఇప్పుడు 100కు పైగా కుటుంబాలకు ఉపాధిని అందిస్తున్న యువకుడి కథ మీరెప్పుడైనా విన్నారా? పెట్టుబడి లేదు, రాయితీలు లేవు, స్థల కేటాయింపులు లేవు, ప్రభుత్వ ప్రోత్సాహాల జోలికే వెళ్ళలేదు, తాను ఇంత మందికి ఉపాధి కల్పిస్తున్నా అన్న ధ్యాసే అతనికి లేదు. ఇది కదా నిజమైన నిజమైన ఉపాధి కల్పన అంటే.

ఇంతటి ఘనత సాధించిన ఈ యువకుడి కథ మన పల్లెసృజన ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత చింతకింది మల్లేశం ద్వారా పల్లెసృజనకు తెలిసింది. మల్లేశం ఇటీవల ఏర్పాటు చేయించిన చేనేత మహిళా కార్మికులకు ఈ రంగంలో శిక్షణ ఇప్పించే కార్యక్రమం చేపట్టిన విషయం పాఠకులకు తెలుసు (జనవరి–ఫిబ్రవరి 2025 సంచికలో ప్రచురించడమైంది). ఆ మహిళలను ఆ ప్రాంతంలో వున్న పెద్ద పెద్ద చేనేత సంస్థలలో వారి పనివిధానాన్ని చూపించే క్రమంలో 'చెరిపెల్లి రాము' గురించి తెలిసింది. అతను గ్రామీణ యువతకు తన గ్రామంలో అద్భుత ఉపాధిని కల్పిస్తూ, తాను ఓ గొప్ప ఎంటర్‌ప్రెన్యూర్ గా మారిన ఆ యువకుడిని మల్లేశం పోచంపల్లిలోని చేనేత కుటుంబాలు, శిక్షణార్థుల సమక్షంలో ఘనంగా సత్కరించాడు. ఈ కథ తెలుసుకోవాలని మీరూ ఉవ్విళ్ళూరుతున్నారా? అయితే పదండి కథనంలోకి.

తెలంగాణ రాష్ట్రం, సమైక్య నల్గొండ జిల్లా, ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా లోని 'భూదాన్ పోచంపల్లి' గ్రామానికి చెందిన 'చెరిపెల్లి రాము' అనే 35 సంవత్సరాల యువకుడు ఈ కథా నాయకుడు. ఇతని









తల్లి నిర్మల, తండ్రి చెరిపల్లి నర్సింహ . రాముభార్య పేరు రాధ, వీరికి ఒక కూతురు పేరు సహస్ర (8 సం.) మరియు హరినాథ్ (5సం.), అభిరాం (7నెలలు) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా 5వ తరగతికి మించి చదువుకోలేక పోయాడు. 5వ తరగతి పూర్తి కాగానే తన తండ్రి ఒక చేనేత కార్మికుడి వద్ద పనిలో చేర్పించాడు. అలా అతని వద్ద ఒక 5 సంవత్సరాలు పని చేశాడు. ఆ తర్వాత మరో చేనేత మగ్గాలు గల యజమాని వద్ద మరో 7 సంవత్సరాలు పని చేశాడు. ఈ యజమాని ప్రోత్సాహంతో ఇతని వద్దనే దాదాపు చేనేతలోని అన్ని పనులను, అందులోని మెళకువలను నేర్చుకున్నాడు. ఆ తర్వాత పోచంపల్లిలో ప్రభుత్వం – ప్రైవేటు వ్యక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన చేనేత పార్కులో మరో 2 సం.లు పని చేశాడు. అక్కడ చాలా రకాల మగ్గాలు ఉంటాయి. అందులో మగ్గం నేర్చుకోవాలి అనుకునే వారికి శిక్షణ, మగ్గం నేయడం వచ్చిన వారిచేత చీరలు నేయిస్తూ ఉంటారు. రాము అక్కడ పని చేస్తూ అందులో కూడా ఎన్నో మెళకువలను నేర్చుకున్నాడు.

అలా మూడు చోట్ల పని చెయ్యటం వల్ల చాలా మంది చేనేత మగ్గాలున్న వారితో పరిచయాలు పెరిగాయి. ఈ పరిచయాలతో ఆ మగ్గాల యజమానుల వద్ద నుండి చీరలు తీసుకుని, సమీపం లోని హైదరాబాదుకు తన మిత్రుడితో కలిసి వెళ్ళి అక్కడ మోటార్ సైకిళ్ళపై తిరుగుతూ మహిళలకు నగదు మరియు వాయిదాల రూపంలో చీరలు అమ్మటం ప్రారంభించాడు. ఇలా ఎంతో కష్టపడి 2 సంవత్సరాల పాటు చీరల అమ్మకాలు చేసుకుంటూ, మార్కెటింగ్‌లో కూడా మెళకువలు తెలుసుకున్నాడు రాము. ఇలా చీరల వ్యాపారం చేసుకుంటున్న సమయంలో ఒక వినియోగ దారుడు తనకు కావలసిన 8 రకాల చీరలు నేయించి ఇమ్మని ఇతనికి ఆర్డరు ఇవ్వటంతో పాటు, అడ్వాన్సుగా 50 వేల రూపాయలు కూడా ఇచ్చాడు.

ఆ వినియోగ దారుడు బయానాగా ఇచ్చిన సొమ్ముతో తానే స్వయంగా ఒక మగ్గం ఏర్పాటు చేసుకుని, తానే వినియోగ దారుడు అడిగిన చీరలను నేత నేసి ఇచ్చాడు. అతనికి ఆ చీరలలో అప్పుడు దాదాపు 20 వేల రూపాయలు నికరంగా మిగిలాయి. అలా.... అలా.... అంచెలంచెలుగా ఎదుగుతూ ఇక వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా తను మగ్గాల ఏర్పాటు చేసుకుంటూ వెళ్ళాడు రాము. అలా తన ఎదుగుదలతో పాటు తాను పెళ్ళి చేసుకోవడం, తన తమ్ముళ్ళకు పెళ్ళిల్లు చేయడంలో కూడా తన బాధ్యతను సక్రమంగా నిర్వహించాడు.

తన ఇంటి బాధ్యతలు పూర్తవటంతో ఇక తన దృష్టిని వ్యాపార అభివృద్ధిపైకి మరల్చాడు రాము. పోచం పల్లిలో ఎంతోమంది తాము మగ్గాలు కొనే స్థోమత లేక, చేనేత పార్కులో ఇతర చోట్ల నేత పనికి వెళ్ళటం గమనించాడు. అటువంటి వారిని ఎన్నుకొని, తానే స్వయంగా వారికి మగ్గం ఏర్పాటు చేయించి, దానిపైన చీరలు నేయటానికి అవసరమైన నూలు, ఆసు పోసిన చిటికలు, రంగులు అద్దిన నూలు తదితర అన్ని సామాగ్రిలను తానే వారికి అందజేశాడు. మీరు మీ ఇంట్లోనే కూర్చుని మగ్గం నేస్తూ ఉండండి, మీరు పూర్తి చేసిన చీరలను నాకు ఇవ్వండి, వాటిని నేను మార్కెటింగ్ చేసుకుంటాను అని వాళ్ళను







ఒప్పిస్తూ అలా ఇప్పటికి 70కి పైగా మగ్గాలను ఏర్పాటు చేశాడు. ఆ కార్మికులు కూడా ఎక్కడికో కూలీకి వెళ్ళకుండా తమ ఇంటిలోనే తాము పని చేసుకుంటూ ఉన్నారు. మగ్గం కొనాల్సిన అవసరం లేదు, పెట్టుబడి కొరకు అప్పులు చెయ్యాల్సిన అవసరం లేదు, వాటిని విక్రయించడం ఎలా అనే బాధ లేదు. అన్నీ తానే చూసుకుంటాడు రాము. ఒక కుటుంబానికి ఇంతకన్నా కావాల్సింది ఏముంటుంది. తాము ఇంటి నుండి బయటకు వెళ్ళకుండా, ఇంట్లోనే కష్టం చేసుకుంటూ బయట కూలీకన్నా ఎక్కువ సంపాదన వస్తే అంతకన్నా ఆనందం ఏముంటుంది ఆ చేనేత కార్మికులకు. ఒక్కో మగ్గం ఏర్పాటు చేస్తున్న కొద్దీ, ఆ మగ్గం ఏర్పాటు చేసుకున్న వారు మరో కుటుంబాన్ని పరిచయం చేయటం ఇలా రాము వ్యాపారాభివృద్ధి నిరాఘాటంగా కొనసాగుతూ ఉంది.

అంత వరకు తాను ఏర్పాటు చేసుకున్న మనుషులతో ఆసు పోయిస్తూ, మగ్గాలకు సరఫరా చెయ్యటం వల్ల పని వత్తిడి పెరగడంతో 4 ఆసు యంత్రాలను ఏర్పాటు చేసుకున్నాడు. తాను తన మగ్గాల వారికి ఆసు అందించే కష్టాన్ని కూడా దాటుకున్నాడు. ఇలా తన వ్యాపారం కొనసాగుతున్న సమయంలో 8 సంవత్సరాల క్రితం చిన్న ఆసు మిషన్ పైన పోసిన ఆసుతో నేసిన చీరలకు గిరాకీ తగ్గటం, 120 కొయ్యల పెద్ద ఆసు చీరలకు డిమాండు పెరగటంతో వెంటనే పెద్ద ఆసు కొయ్యలను ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం దాదాపు అన్ని పెద్ద ఆసు చీరలనే నేయిస్తూ తన రాబడి, తన మగ్గందారులకు పని లేదు అన్న బాధ లేకుండా చేసుకుంటున్నాడు. ప్రస్తుతం చింతకింది మల్లేశం తయారు చేసి ఇటీవలే ప్రారంభ కార్యక్రమాన్ని కూడా పూర్తి చేసుకున్న 'పెద్ద ఆసు యంత్రం' కొనుగోలుకు ఆర్డరు కూడా ఇవ్వటం జరిగింది. అది వచ్చిన వెంటనే మళ్ళీ తన చీరల వ్యాపారానికి ఎటువంటి ఢోకా లేకుండా సాగేలా చేసుకుంటాను అంటాడు రాము.

ప్రస్తుతం తాను ఏర్పాటు చేసిన మగ్గాల వారికి తగిన సామాగ్రి అందించటం కోసం ఆసు పోయటం, రంగులు అద్దటం, వాటిని చిటికలుగా తయారు చేయటం లాంటి పనుల కొరకు తనవద్దనే 30 మందికి పైగా కార్మికులను ఒక్కొక్కరికి 18 వేల నుండి 22 వేల రూపాయల దాకా జీతాలు ఇచ్చి, ఆ గ్రామ యువతకు ఎనలేని ఉపాధి కల్పిస్తున్నాడు రాము. ఇలా తనవద్దకు రోజుకు 10 నుండి 15 చీరలు వస్తూనే ఉంటాయి. తన ఆలోచన అంతా తన వీవర్స్ పని లేక ఖాళీగా ఉన్నాము అని ఆలోచించకుండా, వారికి నిరంతరం పని కల్పిస్తునే ఉండటం నా లక్ష్యం అంటాడు రాము. తాను ఒక్కో చీరను 10 వేల నుండి 18 వేల రూపాయల దాకా డిజైన్లను బట్టి విక్రయిస్తూ ఉంటాడు. తాను మార్కెటింగ్ కోసం ఎక్కడో తిరగాల్సిన అవసరం లేకుండా, టోకు వ్యాపారస్తులే తనవద్దకు వచ్చి తమకు కావలసిన చీరలను తీసుకు వెళ్ళేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాడు రాము.

ఇది "చెరిపల్లి రాము" కథ. ఎటువంటి ప్రభుత్వ పథకాలను, ఉచితాలను ఆశించకుండా, కేవలం 35 సంవత్సరాల యువకుడు, తాను పడ్డ కష్టం తన తోటి చేనేత కార్మికులు పడకుండా చేయటంతో పాటు తాను ఆర్థికంగా ఎంతో ఎత్తుకు, తన ప్రతిభతో అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. తన గ్రామంతో పాటు, తన సమీప గ్రామాలలో 100 కు పైగా కుటుంబాలు పోషణ పొందేలా గ్రామీణ ఉపాధి ఏర్పాటు చేసిన రాముకు అక్షర నీరాజనం పడుతోంది 'పల్లెసృజన'. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామీణ యువత ఎదగాలని, ప్రభుత్వాలు కూడా ఇటువంటి వారికి మరింత ప్రోత్సాహం అందించి, వారి సలహాలతో గ్రామీణ ఉపాధి అవకాశాలను గ్రామాల్లోనే పొందే ఏర్పాటు చేసినట్లయితే మన గ్రామాలు సస్యశ్యామలంగా ఉండటంతో పాటు, ఆర్థికంగా కూడా మరింత బలోపేతం అవుతాయి అనటానికి నిలువెత్తు నిదర్శనం మన 'చెరిపల్లి రాము'.

గ్రామీణ వికాసానికి తోడ్పడుతున్న చెరిపల్లి రాము కృషికి జాతీయ స్థాయిలో తగిన గుర్తింపు వచ్చేందు 'పల్లెసృజన' ముందడుగు వేస్తున్నది. **ఉపాధికర్త చెరిపల్లి రాము, ఫోన్ : 8330969426**






# అడవితో ఆనందం

## 'పల్లెసృజన' బృందం నల్లమల అడవిలో విత్తన బంతులు చల్లే కార్యక్రమం



- వీరరాఘవ రెడ్డి

7 సెప్టెంబర్, 2025 ఆదివారం నాడు 'పల్లెసృజన' బృందం ఒక బృహత్తర కార్యక్రమానికి పూనుకున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ మరియు పర్యావరణ శాఖ సలహాదారుడు, పల్లెసృజన కుటుంబ సభ్యుడై 'కొమెర అంకారావు' (జాజి) ఆధ్వర్యంలో 'కారెంపూడి'కి సమీపాన గల నల్లమల అడవి ప్రారంభం అని చెప్పుకునే "గుత్తికొండ బిలం" పరిసర ప్రాంతమైన 'సింగరుట్ల మాన్యం' దగ్గర వున్న పురాతన చెఱువు దగ్గర నుండి ఈ "అడవితో ఆనందం" అనే యాత్ర ప్రారంభం అయింది.

నల్లమల అడవిలో ఎక్కడ ఏ ప్రాంతం ఉందో, ఎక్కడెక్కడ ఏయే చెట్లు ఉన్నాయో, ఎక్కడ ఏయే జంతు జాలాలు ఉన్నాయో అన్నీ 'కొట్టిన పిండి' కొమెర జాజికి. కాబట్టే దాదాపు 30 మందితో కూడిన ఈ పల్లెసృజన బృందాన్ని నల్లమల అడవి గుండా ఆనందంగా నడిపించాడు. జాజి యాత్రీకులతో మాట్లాడుతూ ఈ చెరువు చాలా పురాతనమైనదని, చాలా కాలంగా సరైన వర్షాలు లేక ఈ చెఱువు ఎండిపోయిందని, ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఈ చెఱువు పూర్తిగా నిండి కళకళ లాడుతోందని తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. పూర్వం ఈ చెఱువు చుట్టు పట్ల, చెరువు అంతా ఎన్నో రకాల ఔషధ మొక్కలతో నిండి ఉండేది. ఇటీవల ఆ ఔషధ మొక్కలన్నీ కనిపించటం లేదు. అందుకు కారణం సరిగ్గా వర్షాలు లేక, మొక్కలకు నీరందక కొన్ని చనిపోయాయి. ఆ తర్వాత ఇటీవలి కాలంలో ఈ చెరువును "కాంగ్రెస్ కంప" అని పిలవ బడే కంప చెట్ల సంతతి బాగా పెరిగిపోయింది. ఈ కంప చెట్లను 'పిచ్చి తుమ్మ', సీమజమ్మి కంప, సర్కార్ కంప అని ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా పిలుచుకుంటారు. ఈ కంపచెట్లు ఇప్పటి వరకు ఊర్లల్లో ఖాళీ ప్రదేశాల్లో, పొలం దారుల్లో ఇరువైపులా, బీడు భూముల్లో మాత్రమే ఉండేవి. వీటి విత్తనాలను మేకలు చాలా ఇష్టంగా తింటాయి, అవితిన్న తర్వాత వాటి బెరడును మాత్రమే అరిగించుకుంటాయి, విత్తనాలు ఆ గొర్రెలు విసర్జించటం వల్ల వాటి విత్తన ఉత్పత్తి విపరీతంగా పెరిగి పోయింది గ్రామాల్లో. ఎక్కడైనా సరే ఈ కంప పెరగడం ప్రారంభం అయిందంటే ఇక వాటి చుట్టూ ఎటువంటి మొక్కలను మలవనీయదు. అంత భయంకరమైన జాతి కంప (ముళ్ళ) చెట్టు ఇది. ఇటీవలే ఈ కంప చెట్లు నల్లమలకు ఎగబ్రాకుతున్నాయి. ఇప్పుడు ఈ కుంటను ఆ సర్కారు కంప కబ్జా చేసింది. ఈ చెఱువు చుట్టూ ఉన్న ఔషధ మొక్కలు అంతరించి పోవటానికి గల ప్రధాన కారణాల్లో ఇది కూడా ఒకటి కాబట్టి దీన్ని ఇక్కడితో నిర్మూలించక పోతే నల్లమలకు భవిష్యత్తులో చాలా ప్రమాదం పొంచి ఉందని, ఇది పర్యావరణానికి కూడా భారీ నష్టం వాటిల్ల జేస్తుందని వాపోతూ, వీటి నిర్మూలను ఏదైనా ఉపాయం 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి రావాలని కోరుకున్నాడు జాజి.

అలాగే రైతులకు తమ పొలాల్లో 'వయ్యారి భామ' అనే కలుపు మొక్క (దీన్నే రాయలసీమ ప్రాంతంలో 'తిక్క బంగి' అంటారు) కూడా అలాంటిదే అని, అది కూడా విపరీతంగా, విస్తారంగా పెరిగుతుందని, అది కూడా పారం కంపలాగే ఇతర ఏ మొక్కలను ఎదగనీయదని అన్నాడు. ఈ వయ్యారి భామ ముందుగా పొలం గట్లలో మొలిచి, ఆ తర్వాత తన సంతతిని మొత్తం పొలమంతా విస్తరింపజేస్తుంది. దీని



విత్తనం కాయలు

సర్కారు కంప

నల్లమలలో విస్తరిస్తున్న చెట్లను పరిశీలిస్తున్న బ్రిగేడియర్


నల్లమలలో బ్రిగేడియర్ గణేశంతో 'పల్లెసృజన' బృందం

విత్తనాలు గాలికి కొట్టుకొని పొలంలో పడటం ద్వారా ఈ మొక్క విస్తరిస్తుంది. దీని నివారణకు ప్రకృతిలోనే ఒక శత్రువు ఉంది. వయ్యారి భామకు శత్రువు మొక్కలు 'తగిరస', చక్రమర్ద (దీన్నే తుంటెపు మొక్క అంటారు), తంగేడు. ఎప్పుడైతే ఈ మొక్కలు విరివిగా విస్తరిస్తాయో కొన్ని రోజులకు 'వయ్యారి భామ' మొక్కలు అక్కడ అంతరించి పోతాయి. కావాలంటే అందరూ ప్రత్యక్షంగా గమనించండి, తంగేడు చెట్లు, తగిరస, చక్రమర్ద చెట్లు విస్తరించి వున్నచోట 'వయ్యారి భామ' ఉండదు.

ఆ తర్వాత అడవిలో ఒక కిలో మీటరు దాకా ప్రయాణం చేస్తూ, అడవిలో కనిపించే ఎన్నో రకాల మొక్కలను చూపిస్తూ, వాటివల్ల మనకు చేకూరే ఔషధాలు, వాటివల్ల మనకు ఒనగూరే లాభాలను గురించి విశదంగా వివరించాడు జాజి. కొన్ని రకాల అడవి పండ్లను తెంపి రుచి చూపించాడు. 'డబర దంగి' (దీన్నే బుడ్డ కాయల చెట్టు, అడవి ద్రాక్ష అని కూడా అంటారు) చెట్టు కాయలను పూర్వం మహిళలకు బాగా తినిపించే వారని, వీటిని తినటం వల్ల స్త్రీ పురుషులలో వున్న దోషాలు చాలా వరకు పోతాయి. పురుషుల్లో వీర్యకణాల అభివృద్ధి బగా పెరిగి, సంతాన సాఫల్యానికి కారణమౌతుందని, మహిళలు కూడా గర్భస్త దోషాలేమైనా ఉంటే అవి తొలగిపోయి, గర్భం దాల్చే అవకాశాలు మెండుగా ఉండేవని వివరించాడు. బృందం సభ్యులు కూడా అడవికి వచ్చి ఒక పండు రుచి చూడగలిగామని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఇలా చెట్లను, అడవి జంతువులను, అటవీ వాతావరణాన్ని గురించి తెలుసుకుంటూ తిన్నగా నడక సాగిస్తూ ఒక మైదాన ప్రాంతాన్ని చేరుకున్నారు యాత్రీకులు. అక్కడ చెట్లు కొద్దిగా తక్కువగా ఉండటంతో జాజి తనవెంట తెచ్చిన విత్తన బంతులను అందరికీ పంచి, అందరి చేతా వాటిని అడవిలో విసిరేయించాడు. ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తుం


వయ్యారి భామ (తిక్కబంగి) | తగిరస (చక్రమర్ద, తుంటేపు) | మహాబల (పరాసి కలప, పోలికట్టె)


విత్తన బంతులను వెదజల్లుతున్న బృంద సభ్యులు

డటంతో మనం వేసి ఈ విత్తన బంతులలో 10% మొక్కలు మొలకెత్తినా చాలు అడవి ఎంతో అభివృద్ధి చెంది ఎన్నో మొక్కలకు జీవం పోసిన వారం అవుతామని యాత్రికులకు తెలియజేయటంతో వారు కూడా అందరూ తమకు అడవిలో కూడా ఇంతటి ఆనందాన్ని పంచిన జాజికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరు మాసాల క్రితం 'పల్లెసృజన' బృందం 'సంవేదన' పేరుతో నల్లమల అడవిని గురించి, అక్కడ జాజి అడవిని శుభ్రం చేస్తున్న విధానాన్ని తెలుసుకుని, తామూ ఆ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని వెళ్ళటం జరిగింది. నల్లమల అడవి నాటికీ, నేటికీ ఎంతో రమణీయంగా మారిందని, నాడు ఎండలను తట్టుకోలేక సేద తీరటానికి చెట్లు కూడా సరిగ్గా లేని ప్రాంతం ఇప్పుడు పచ్చదనం, పళ్ళు, పువ్వులు, చిగురు వేసిన మొక్కలతో కళకళలాడుతుండటంతో ఇది నిజంగా 'అడవితో ఆనందం' అని తృప్తి చెందారు యాత్రీకులు.

బ్రిగేడియర్ గణేశం, వాలంటీర్లు నాగమోహన్ తదితరుల నేతృత్వంలో ఈ బృందం హైదరాబాద్ నుండి కూడా కొన్ని రకాల విత్తనాలను సేకరించుకుని, పల్నాడు జిల్లా 'కారెంపూడి' చేరుకున్నారు. అక్కడికి అప్పటికే పల్లెసృజన వాట్స్‌యాప్ గ్రూపుల ద్వారా పిలుపునివ్వటంతో మరికొందరు యాత్రీకులు అక్కడి చేరుకున్నారు. మొత్తానికి దాదాపు 30 మంది దాకా బృందం కారెంపూడి నుండి నల్లమల అడవికి బయలుదేరి, అక్కడి వాతావరణాన్ని ఆనందంగా ఆస్వాదించి, అడవికి చెందిన ఎన్నో విశేషాలను తెలియజేసిన జాజి మాటలను తమ మస్తిష్కంలో నెమరు వేసుకుంటూ ఎంతో తృప్తిగా తమ నివాసాలకు చేరుకున్నారు.

## నాటిన మొక్కలకు 'పల్లెసృజన' ఆశీర్వాదం

ప్రకృతి ప్రేమికుల వినూత్నమైన ఆశీర్వాదం ఈ "అడవితో ఆనందం" యాత్రలో చోటు చేసుకుంది. రాజశేఖర రెడ్డి అనే ఒక యాత్రికుడు 6 మర్రి మొక్కలు, 1 అల్ల నేరేడు మొక్కలను తీసుకుని వచ్చారు. ఆ మొక్కలను యాత్రీకులు కారెంపూడి లోని 'వీర్లగుడి' ప్రాంగణంలో నాటడం జరిగింది. తదుపరి అందరు యాత్రీకులు మొక్కలను ఈ విధంగా యాత్రీకులు ఆశీర్వదించారు".

**కాబోయే తరువు తల్లులకు ఆశీస్సులతో,**

"మీరు అనేక వందల ఏళ్ళు జీవించి, అనేక రకాల పక్షులకు నెలవై, వన్య ప్రాణులకు నెలవై ఫలాలను అందించి, పర్యాటకులను అక్కున చేర్చుకుని సేద తీర్చాలని, మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ.... మీరు చిరంజీవులై వర్ధిల్లాలని కోరుతూ".... **మీ 'పల్లెసృజన'.**

ఈ సంఘటనను ఊహించుకోండి, ఎంత ఆనందం వేస్తుంది కదూ!

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించడం ద్వారా యువతకు ఉపాధి, రైతుకు, గ్రామానికి సేవ

'పల్లెసృజన' గత 10–15 సంవత్సరాలుగా చెబుతున్న మాట "రైతు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తరళించి విక్రయించకుండా, వాటికి విలువను జోడించి విక్రయించినట్లయితే గ్రామాలు స్వయంప్రతిపత్తి సాధిస్తాయి" అని. ఇంత కాలానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నోట పల్లెసృజన మాట వెలువడింది. ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెంచడం కోసం ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షా సమావేశం లో ఈ విషయమై చర్చించినట్లు 5–8–2025 పత్రికలలో వార్త వెలువడింది.

ప్రభుత్వమే ఈ విషయాన్ని గుర్తించింది కాబట్టి గ్రామీణ యువత దీనిపై దృష్టి సారిస్తే తమ గ్రామంలోనే మంచి ఉపాధి పొందటం తో పాటు, గ్రామంలోని రైతాంగానికి, వినియోగ దారులకు సేవను అందించడమే కాకుండా గ్రామాభ్యుదయానికి, తమ గ్రామాన్ని స్వయం ప్రతిపత్తి గ్రామంగా తయారు చేసుకోవటానికి కూడా తోడ్పడిన వారు అవుతారు అనటంలో ఎటువంటి సంశయం లేదు. ఇది కొంత ఖర్చుతో కూడుకున్న పని కాబట్టి మీ స్థానిక శాసన సభ్యుని సహకారంతో ప్రభుత్వానికి, బ్యాంకులను నివేదిక అందించినట్లయితే మీ పెట్టుబడికి అవసరమైన డబ్బు ఏర్పాటు అయ్యే అవకాశం తప్పకుండా ఉంటుంది.

ఈ "వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించడం" గురించి ఈ క్రింద కొన్ని సూచనలు అందిస్తోంది పల్లెసృజన.

సమాజంలోని ప్రతి ఒక్కరు భుజించే దాదాపు ప్రతి ఆహారం రైతు పండించినవే అన్న విషయం మీకందరికీ తెలిసిందే. వాటికి విలువను ఎలా జోడించాలి, దానికి ఉజ్జాయింపుగా ఎంత ఖర్చవుతుంది అన్న విషయాలను గురించి తెలుసుకుందాం.

### మినీ రైస్ మిల్లు :

పల్లెసృజన ద్వారా వెలుగులోకి వచ్చిన 'వినయ భూషణ్ రెడ్డి అనే ఇన్నోవేటర్ గ్రామాలకు తగినట్లుగా, పెద్ద రైసు మిల్లు నాణ్యతకు ఏమాత్రం తగ్గకుండా ఒక మినీ రైస్ మిల్లును తయారు చేశాడు. ఈ రైస్ మిల్లులో సన్న వరి ధాన్యం నుండి పొడవాటి బాస్మతి వరి ధాన్యం వరకు అన్ని రకాల ధాన్యాన్ని బియ్యంగా తయారు చేసుకోవచ్చు. అవసరమైన మేర బియ్యానికి పాలిష్ కూడా చేసుకోవచ్చు. అంతే కాక, ఇదే మినీ రైస్ మిల్లులో చిరు ధాన్యాలు (మిల్లెట్స్) అయిన కొర్రలు, అండుకొర్ర, సామలు, ఊదలు, బరిగలు ధాన్యాన్ని కూడా బియ్యంగా మాచవచ్చు. అలాగే ఇదే మిల్లులో గోధుమలకు పైనున్న పొట్టును కూడా తీసివేయ వచ్చు. ఈ విధంగా పొట్టు తీసిన గోధుమలను పిండి మరియు నూకను



మినీ రైస్ మిల్లు



మినీ దాల్ మిల్లు

తయారు చేయుటం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు. ఈ విధంగా ఎన్నో రకాల పనులను ఒకే యంత్రంతో తయారు చేసుకో వచ్చు. ఈ మిల్లు ఏర్పాటు చెయ్యటానికి 10 అ. వెల్పు, 20 అడుగుల పొడవున్న గది లేదా షెడ్డు చాలు. మీ అవసరాన్ని బట్టి సింగల్ ఫేస్ లేదా 3 ఫేస్ మోటార్లతో నడిచేలా ఈ మిల్లును తయారు చేసి ఇస్తాడు. గ్రామ సామర్ధ్యాన్ని బట్టి అంటే మీరు ఆడించే ధాన్యం పరిమాణాన్ని బట్టి ఈ మినీ రైస్ మిల్లు 4.5 లక్షల నుండి 6.5 లక్షల వరకు లభిస్తాయి.

**పప్పుధాన్యాలకు విలువను జోడించడం:**

గ్రామంలో పండే కందులు, మినుములు, పెసలు, శనగలు లాంటి పప్పు ధాన్యాలను రైతు నేరుగా మార్కెట్‌లో విక్రయించి నష్టపోకుండా వాటిని మీరు సేకరించి వాటిని పప్పుగా మార్చడం ద్వారా స్వచ్ఛమైన, కల్తీలేని పప్పు ధాన్యాన్ని మీరు సమాజానికి అందించిన వారవుతారు. ఈ పప్పు ధాన్యాలను తయారు చెయ్యటానికి ప్రస్తుతం మార్కెట్‌లో చాలా రకాల చిన్న 'దాల్ మిల్లు'లు లభ్యమవుతున్నాయి. "గూగుల్ సర్చ్" ద్వారా వాటిని పరిశీలించి, కొనుగోలు చేకున్నట్లయితే మీ గ్రామంలో పండే పప్పు ధాన్యాలను పప్పుగా మార్చుకోవచ్చు. వీటిని ఏర్పాటు చేసుకోవటానికి కూడా పెద్దగా స్థలం అవసరం ఉండదు. ఈ యంత్రాలు రూ. 20 వేల నుండి రూ. 1 లక్ష 20 వేల ఖరీదులో లభిస్తున్నాయి. వీటి ద్వారా మీరు ముడి ధాన్యాన్ని పప్పుగా మార్చడం అవసరమైనంత మేర పాలిష్ చేసుకునే సదుపాయం కూడా ఉంటుంది.

ధాన్యాన్ని పప్పుగా తయారు చేసిన తర్వాత దాన్ని మీ గ్రామంలోనే ఉన్న పిండి మర ద్వారా పప్పును పిండిగా చేసి పిండితో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించుకోవచ్చు.

పైన వివరించిన రెండు మిల్లుల ద్వారా లభించే పొట్టును మీ గ్రామంలోనే పాల ఉత్పత్తి చేసే వారు తమ పశువులకు దాణాగా వినియోగించుకుంటారు కాబట్టి పొట్టు ద్వారా కూడా మరో అదనపు ఆదాయం లభిస్తుంది.

**వేరుశనగ పప్పు, అప్పాలు, చేగోడీలు చేసే యంత్రాల ద్వారా ఉపాధి:**

వీటిలో ముందుగా వేరుశనగ పంటను రైతు నుండి నేరుగా సేకరించి, వాటిని వేడి చేసి విత్తనాలను వేరు చేసిన తర్వాత ఈ వేరుశనగ పప్పు యంత్రంలో వేసినట్లయితే ఆ విత్తనాల పైన వున్న పొట్టు, బద్దలు (పప్పు వడుకలు) వేరుగా వస్తాయి. వీటిని చెగోడీలు, అప్పాలు, వేరుశనగ పొడి లాంటి ఇతర ఆహార పదార్థాలుగా మార్చుకో వచ్చు. లేదా వేడి చేసిన వేరుశనగ పప్పును కూడా నేరుగా విక్రయించ వచ్చు.

పైన చెప్పిన విధంగా శనగ, కంది, మినుప పప్పు పిండిని చెగోడీలు, అప్పాలు గా తయారు చెయ్యటానికి వేరువేరుగా జ్యోతుల జష్వంత్ అనే ఇన్నోవేటర్ తయారు చేసిన యంత్రాలను వెలుగులోకి తెచ్చింది పల్లెసృజన. ఈ యంత్రాలను ఉపయోగించడం ద్వారా ఒకే నాణ్యత, పరిమాణంలో ఉండే అప్పాలు, చెగోడీలను తయారు చేయవచ్చు. వీటిని గ్రామాలలో తిరుగుతూ దుకాణాలకు విక్రయించే వారితో పరిచయాలు పెంచుకోవడం ద్వారా వారు తమకు అవసరమైన



వేరుశనగ పప్పు, అప్పాలు చేసే, చెగోడీలు తయారు చేసే యంత్రాలు

చెగోడీలు, అప్పాలు, వేరుశనగ పిండి లాంటి వాటిని వారికి అమ్మటం ద్వారా మీ గ్రామంలోనే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. ఇంకా ఎక్కువగా ఉత్పత్తి చేసుకున్నట్లయితే సమీప పట్టంలోని పెద్ద పెద్ద కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లు, అపార్ట్‌మెంట్ లలో వాటిని విక్రయించుకోవచ్చు.

**బల్క్ రోటీ మేకర్:**

ప్రస్తుత సమాజంలో జొన్న రొట్టెలు, గోధుమ రొట్టెల వినియోగం బాగా పెరిగింది. రహదారుల ప్రక్కన ఏర్పాటు చేసిన దాదాపు ప్రతి డాబాలో వీటిని విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించే వారిలో చాలా మంది ఆ రొట్టెలను తయారు చేసేందుకు నైపుణ్యం గల పనివారు లభించక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి వ్యాపారంలో ఈ పనివారు లభించక నష్టాలను చవిచూస్తున్న వారు కూడా ఉన్నారు. ఈ సమస్యను గమనించి ఎ.జె. రావు అనే ఇన్నోవేటర్ తయారు చేసిన బల్క్ రోటీ మేకర్ ను వెలుగులోకి తెచ్చింది పల్లెసృజన.

గ్రామంలోని రైతుల వద్ద పండిన జొన్నలు, సజ్జలు, గోధుమలను కొనుగోలు చేసి వాటిని పిండి చేసుకుని ఈ యంత్రం ద్వారా రొట్టెలు చెయ్యటమే కాదు, ఆ యంత్రంలోనే ఆ రొట్టెలు కొద్దిగా వేడి చేసి ఇస్తుంది కాబట్టి అవి చాలా రోజుల వరకు పాడు కాకుండా ఉంటాయి. ఇలా తయారు చేసిన రొట్టెలను ఒక్కో ప్యాక్‌లో 10-20 చొప్పున ప్యాకింగ్ చేసుకుని డాబాలకు, హోటళ్ళకు విక్రయించడం ద్వారా వారి సమస్య తీర్చినట్లు అవుతుంది, రైతుకు అధిక ధర లభిస్తుంది, మీకు ఉపాధి కలుగుతుంది. ఆ హోటళ్ళలో వున్న మాస్టర్ వినియోగ దారుడికి అవసరం అయినప్పుడు వెంటనే వాటిని తీసి పెనంపైన పూర్తిగా వేయించి వేడి వేడిగా సరఫరా చేస్తాడు. అన్ని రొట్టెలు సమాన పరిమాణంలో, నాణ్యతతో ఉండటం వల్ల వినియోగ దారుడు కూడా సంతోషంగా వాటిని ఆరగిస్తాడు. ఈ విధంగా మీ రొట్టెల విక్రయం వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుంది.

**చెఱుకు మొక్కల పెంపకం:**

సాధారణంగా రైతులు చెఱుకు మొక్కలను ఎక్కడో దూరంలో వున్న నర్సరీల నుండి తెచ్చి నాటడం లేదా చెఱుకు ముక్కలను కత్తిరించి నాటడం జరుగుతూ ఉంటుంది. చెరుకు గడలో కేవలం కణుపుల వద్ద నుండి మాత్రమే చెరుకు మొక్క మొలకెత్తుతుంది. మిగతా చెఱుకు ముక్క అంతా భూమిలో వృధాగా కలిసి పోతుంది. ఈ సమస్యను గుర్తించిన అల్లాడి ప్రభాకర్ అనే ఇన్నోవేటర్ కేవలం చెఱుకు కణుపులను మాత్రమే కత్తిరించేందుకు ఒక చిన్న యంత్రాన్ని తయారు చేయగా పల్లెసృజన దాన్ని వెలుగులోకి తీసుకు రావటం జరిగింది. చెఱుకు పంట విరివిగా



బల్క్ రోటీ మేకర్



చిన్న రోటీ మేకర్



చెఱుకు కణుపులను కత్తిరించే యంత్రం

పండించే గ్రామాలలోని రైతుల నుండి చెఱుకును కొనుగోలు చేసి, వాటి కణుపులను కత్తిరించి ఆ కణుపులను ట్రేలలో నాటి వాటిని మొలకెత్తిన తర్వాత అదే రైతు మీవద్ద ఆ చెఱుకు మొక్కలను తీసుకు వెళ్ళి మళ్ళీ తన పొలంలో నాటుకుంటాడు. ఈ విధంగా యువత తమ ఉపాధిని పొందవచ్చు. ఈ పద్ధతితో కణుపులను మాత్రమే నాటడం, మిగతా చెఱుకును బెల్లం తయారు చేసే వారికి లేదా చెరుకు రసం తయారు చేసే వారికి విక్రయించుకోవటం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు.

**ప్యాకింగ్:**

పైన వివరించిన రైతు సంబంధ వ్యాపారలలో యువత రైతు ఉత్పత్తికి విలువను జోడించిన తర్వాత జాగ్రత్త తీసుకోవలసిన ప్రధాన అంశం వాటి ప్యాకింగ్. మీరు చేసే ప్యాకింగ్ మీదనే మీ వ్యాపారం అభివృద్ధి ఆధార పడి ఉంటుంది. అందుకే ప్యాకింగ్ వీలైనంత ఆకర్షణీయంగా ఉండేలా చూసుకోవటం చాలా ముఖ్యం. ప్యాకింగ్ చెయ్యటానికి గ్రామాల్లో విధిగా మనుషులను పెట్టుకోవాల్సిన అవసరం లేకుండా ఒక పని చెయ్యవచ్చు. గ్రామాల్లోని చాలా మంది మహిళలు, కొందరు వృద్ధులు తమ ఇళ్ళల్లోనే కాలం వెలిబుచ్చుకుంటూ ఉంటారు. అటువంటి వారి వద్దకు మీరు తయారు చేసిన పదార్థాలను, ప్యాకింగ్ సామాగ్రిని వారికి అందించినట్లయితే వారు తమ ఇళ్ళల్లోనే ఉంటూ మీకు అవసరమైన ప్యాకింగ్ చేసి ఇస్తారు. ఈ విధంగా చాలా తక్కువ ఖర్చుతో మీ ప్యాకింగ్ అవసరం తీరి పోతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను మీరు ఆర్జించవచ్చు.

**మార్కెటింగ్:**

పైన పేర్కొన్న విలువ ఆధారిత వస్తువులు తయారు చెయ్యటం ఒక ఎత్తయితే, వాటిని మార్కెటింగ్ చేసుకోవటం మరోయెత్తు. కాబట్టి మీరు మార్కెటింగ్ చెయ్యాలి అనుకున్న వస్తువు నాణ్యత, ఆకర్షణీయతతో పాటు మీరు మాట్లాడే మాటలు, వినియోగ దారుడి మనస్సును హత్తుకునేలా ఉండటం చాలా ప్రధానం. కాబట్టి మార్కెటింగ్ ఎక్కడ చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ విక్రయాలు జరపవచ్చు అన్న విషయం జాగ్రత్తగా ఆలోచించి, మీ మీ వినియోగదారుడిని ఎన్నుకోవాల్సి ఉంటుంది.

కాబట్టి గ్రామీణ యువత మీ గ్రామంలోనే ఉంటూ, మీ తోటి రైతుల దిగుబడులకు అధిక ధర వచ్చేలా చెయ్యటం, వాటికి విలువను జోడించడం ద్వారా మీ గ్రామంలోనే కొంతమంది యువతకు ఉపాధి ఇవ్వటం, మీరు ఉపాధి పొందటం ద్వారా మీ గ్రామాన్ని స్వయసమృద్ధి గ్రామంగా తయారు చేసుకోవాలని కోరుకుంటోంది పల్లెసృజన.

పైన వివరించిన వాటిని ఏర్పాటు చేసుకోవాలి అనుకున్న వారు సంప్రదించండి : **వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904; సుభాష్ చందర్, ఫోన్ : 96528 01700.**

### 49వ జాతీయ శోధయాత్ర

# తూర్పు ఉత్తర ప్రదేశ్ నుంచి అసాధారణ సందేశం !

## ఉత్తర ప్రదేశ్ లోని బల్లియా మరియు ఘాజీపూర్ జిల్లాలో 20-26 జూన్, 2023 తేదీల్లో జరిగిన శోధయాత్ర చివరి భాగం



స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

**(గత సంచిక తరువాత)**

దౌలత్‌పూర్ గ్రామానికి వెళ్ళే మార్గంలో సురేష్ రాయ్ గారిని కలిశాము. ఈయన 2015లో రికార్డు స్థాయిలో హెక్టారుకి 396 క్వింటాళ్ళ 'సుఖసాగర్' రకం ఉల్లిపాయలు పండించి, జాతీయ స్థాయి పురస్కారం అందుకొన్న వ్యక్తి. చదువుకున్నది మెకానికల్ ఇంజనీరింగ్ అయితే వ్యవసాయంపై ఆసక్తి ఎక్కువ. ఈయన తన పొలంలో బోరు బావిలోని నీటిలో నుంచి ఇనుము శాతం తగ్గించి, మనుషులు కూడా త్రాగటానికి వీలైన స్వచ్ఛమైన నీటిని పైకి తీసే పద్ధతిని కనుగొన్నాడు. దానికతను ప్లాస్టిక్ పైపుల స్థానంలో ఇత్తడి పైపులను వాడి దీనిని సాధించానని చెప్తాడు. ఈయన మా యాత్రీకులకు వరిగడ్డి నింపి చేసిన పరుపులు, దిండ్లు చూపించారు. శనగపిండి, బెల్లం, అల్లం, పసుపు, మిరియాలతో చేసిన అరుదైన లడ్డులు రుచి చూపించారు.

ఇంకో ఇన్నోవేటర్ దివాకర్ రాయ్. ఈయన ఎవరెన్ని విధాల నిరుత్సా పరిచినా ఎరువులు చిమ్మే యంత్రం మరియు విత్తనాలు నాటే డ్రమ్ సీడర్ తయారు చేసాడు. 'అవతి' ఏరియా చుట్టూ పక్కల గ్రామాల వారికి బాడుగకు ఇచ్చి ఆదాయం సంపాదిస్తున్నాడు. 'లొచైన్' గ్రామానికి చెందిన జితేందర్ రాయ్ ఉల్లిగడ్డలు ఎక్కువ కాలం నిలువ ఉంచడానికి తానే ఒక గదిని నిర్మించుకొన్నాడు. కొన్ని హాలోజన్ బల్బులు, ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు ఉపయోగించి దీనిని సాధించాడు.

డా. రామకుమార్ రాయ్ 'శివాన్స్' అనే ఎఫ్‌పిఓ స్థాపించి, తోటి రైతులకు 'అవిశ'గింజలను పండించటమే కాకుండా, విదేశాలకి ఎగుమతి చేసి, భారీ మొత్తంలో ఆదాయం వచ్చేట్టు చేస్తున్నాడు. అంతే కాక ఒమెగా–3 క్యాప్స్యూల్స్‌ని తయారు చేసి, జర్మనీ మరియు ఇతర ఐరోపా దేశాలకి ఎగుమతి చేస్తున్నాడు. దీనికి విదేశాలకి సరుకు ఎగుమతికి పాటించాల్సిన అతి కష్టతర ప్రమాణాలను సాధించటానికి ఐఐటి భోపాల్, వారణాసి విశ్వ విద్యాలయం మదలైన సంస్థల సహాయం తీసుకొన్నాడు. వీటిని సాధారణ గది వాతావరణంలో 2 సంవత్సరాలు నిలువ ఉండేలా రూపొందించారు. అంతే కాక ఐసిఎఆర్ ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసర్చ్ వారి ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వెజిటబుల్ రీసర్చ్ (ఐఐవిఆర్) వారి సహాయంతోపచ్చి మిరపకాయ పొడిని తయారు చేయటం ప్రారంభించి, 2019లోనే ఒక కర్మాగారాన్ని నిర్మించారు. ఈ మిరప పొడిని యుఎఇ, ఖతార్, ఓమన్ లాంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

అక్కడే మేము సైకిల్‌తో పని చేసే 'గొర్రు', పొడిచేసే యంత్రాలు, సులభంగా బోరు బావులు త్రవ్వే పరికరాలు హరిమాన్ శర్మ రూపొందించిన ఆపిల్ పంటలు, ఇలా ఎన్నో ఇన్నోవేషన్‌లు చూశాము. ఈ సందర్భంగా మాతో ఎంతోమంది స్థానిక యువకులు తమ ఆలోచనలు పంచుకున్నారు.

యాత్ర మొత్తంలో రైతులు, స్థానికులు, తమ పొలాలలో పంటలకి తెగుళ్ళు, చీడపీడల బాధలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. మేము మన హనీబీ దగ్గరున్న అనేక ఉపాయాలు వారితో పంచుకున్నాము. వారు పశువులకి, మనుషులకి కూడా జలగలు పట్టుకుని రక్తం పీల్చేస్తాయని చెప్పగా ఒక యాత్రీకుడు హనీబీ పత్రికలో గతంలో ప్రచురించిన "నీటిలో నానబెట్టిన పొగాకు రసాన్ని వాడమని" చెప్పాము. ఈ ప్రసంగాలు జరుగుతున్నప్పుడు స్త్రీలు కూడా ముందుకు వచ్చి తమ పశువుల పెంపకంలో ఎదురయ్యే అనేక బాధలు, వాటి సమాధానాలు మాతో పంచుకున్నారు. అక్కడే మా యాత్రీకులు గుంపులు గుంపులుగా



విడిపోయి, మహిళలతో చర్చించటం ప్రారంభించాం. అందరిలో మాట్లాడటం వారికి ఇష్టం లేదని గ్రహించి ఈ విధంగా చెయ్యాల్సి వచ్చింది. వారు చెప్పిన దాని ప్రకారం వెదురు మానవులకి మంచి నేస్తం అనీ, దానితో 'విసన కర్రలు', వంట సామాగ్రి, బొమ్మలు, చెంచాలు, గరిటలు, అలంకరణ వస్తువులు మొదలైనవి చేస్తుంటారట.

చాలా ప్రదేశాలలో స్థానికంగా మహిళలు రకరకాల వంటకాలు చేసి రుచి చూపించారు. ఆ చుట్టు ప్రక్కల లభించే కూరగాయలు, మసాలాలతో తయారు చేసిన చాలా చక్కని వంటలు రుచి చూశాం.

ప్రతి శోధయాత్రలో భాగంగా మేము వయో వృద్ధులను కూడా కలిశాం. శతాధిక సంవత్సరాల కల చాలా మంది ఉన్న ముబారక్‌పూర్ గ్రామంలో మేము మీ ఆరోగ్య రహస్యం గురించి చెప్పమని అడగగా, వారు మాది ఒక ప్రత్యేకమైన గ్రామం. ఎందుకంటే ఇక్కడంతా శాఖాహారులే. మేమంతా ఈమధ్యనే గంగోత్రి రకం గోవుపాలు త్రాగటం ప్రారంభించాం. అది కూడా మా ఆరోగ్యానికి దోహద పడుతోంది. చాలా కాలం క్రితం మా గ్రామంలో 'చౌదరీ సాధుజీ' అనే ఆయన 150కి పైగా 'గంగోత్రి' జాతి ఆవులని పెంచాడని కథలుగా చెప్పుకుంటారు.

'మట్లైహ' గ్రామంలో 'హరిమాన్‌జీ' అనే వస్తాదుకి స్వంత ఇల్లు తన వారనేవారు ఎవ్వరూ లేరు. పాత కాలం సంఘటనలు గుర్తు తెచ్చుకుంటూ జానపద బాణీలో పాటలు పాడుతుంటాడు. రోజూ ఎవరో ఒకరు అన్నం పెడుతుంటారు. ఏదో ఓ ఇంటి అరుగుమీద పడుకుంటాడు. ఈ విధంగా పాడుతూ మా ప్రాంతం గత చరిత్ర మరుగుపడి పోకుండా కాపాడుతుంటాడని చెప్పారు స్థానికులు.

'లోచన్' గ్రామంలో రాంరహత్ యాదవ్‌జీ అనే వ్యక్తి తనకున్న కష్టపడే శక్తి ఉన్నవారు మీకెవరైనా దొరికితే నేను వ్యవసాయం చెయ్యటం మానేస్తానని సవాలు విసిరాడు. ఒక 95 సంవత్సరాల సర్‌జూరాయ్ తన పళ్ళు గట్టిగానే ఉన్నాయని, ఏదీ ఊడిపోవటం కాదు కదా కనీసం కదలటం కూడా లేదని చెప్పాడు. తన చిన్నతనంలో తాను రోజూ అర కిలో దేశీ నెయ్యి తాగేవాడిననీ, తన తాతగారు ఎంతో బరువైన వ్యాయామం చేసే కర్ర దుంగలని అవలీలగా ఎత్తేవాడనీ గర్వంగా చెప్పాడు.

'జోగా మోషీబా' గ్రామంలో సుదచన్ రాయ్ తను చిన్నప్పటి నుండి సామలు, రాగులు,జొన్నలు లాంటి చిరు ధాన్యాలే తింటున్నానీ, రోజూ మూడుసార్లు పాలు తాగుతాననీ యింత వరకు మద్యపానం చెయ్యలేదనీ ఎక్కడికి వెళ్ళినా నడుచుకుంటూ వెళతాననీ, రోజు కనీసం 10 కి.మీ. నడుస్తాననీ చెప్పాడు. ఇంట్లో తప్ప ఎప్పుడూ బైట భోజనం చేసి ఎరుగననీ చెప్పాడు.

ముబారక్‌పూర్ గ్రామంలో అవధ్ బీహరీ రాయ్ మా యాత్రను భూదాన్ ఉద్యమంతో పోల్చి మాట్లాడారు. అక్కడి యువకులు జ్యోతీబాయి పూలే, సావిత్రీ పూలే పుణ్య దంపతులు చెప్పినట్లు అందరూ





చదువుకోవాలి అన్న అంశంపై చిన్న నాటికను ప్రదర్శించారు. చాలా బాగా అనిపించింది.

చాలా ప్రదేశాలలో మనం సాధారణంగా పిలిచే 'కాంగ్రెస్ గడ్డి' లేదా 'వయ్యారి భామ' చెట్లు విరివిగా పెరిగిపోయాయి. పంటలకు హాని చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ఇది చాలా ఉధృతంగా పెరిగి పోతుందని చెప్పారు. ప్రతి ఎకరం పొలంలో 500–700 గింజలను చిమ్మి 5 కిలోమీటర్ల వరకు విస్తరిస్తుందని వాపోయారు. దీనికి హనీబీలో మనకు తెలిసిన కలుపు నివారణ మార్గాలు కొన్ని సూచించాము. వరి పొలాల్లో భారీ స్థాయిలో నీరు పెడితే దానిని కొంత వరకు నివారించ వచ్చని చెప్పాం. 'మసర్‌దేవ' గ్రామంలోని రైతులు బచ్చలికూర తీగలు పెంచితే ఈ వయ్యారి భామ బాగా నియంత్రిస్తుందని చెప్పారు.

'గోడీఖాస్' గ్రామంలోని ప్రజలు వర్షాకాలంలో ఆ ప్రాంతంలో ఈగల్లాంటి ఎగిరే పురుగులు వచ్చి కాండాలని తొలిచి వేస్తున్నాయని చెప్పారు. హనీబీ వాలంటీర్‌లు తాము త్వరలో తగిన పరికరాలతో వచ్చి పరిశోధన చేసి తగ్గ పరిష్కారం కనుగొంటామని మాట యిచ్చారు.

అదే గ్రామానికి చెందిన తారకేశ్వర్ భాయ్ తాను మద్య నిషేధం కొరకు చాలా సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తున్నాననీ, మద్యపానం మంచిది కాదని నిరూపించడానికి తాను ఒక ప్రయోగం చేస్తుంటాననీ, రెండు గాజు గ్లాసులను తీసుకొని ఒక దానిలో మద్యం నింపి, రెండవ దానిలో మంచి నీరు ఉంచి, రెండింటిలోను వానపాము వేసేవాడిననీ మంచినీటిలోని వానపాము సజీవంగా ఉందని, మద్య పానీయం కల గ్లాసులోని వానపాము చనిపోయిందని, దీనిని తార్కాణంగా తీసుకొని మీకేం అర్థమయ్యిందని ప్రజలని అడిగారు. కొందరు విషయం అర్థం అయినా నవ్వులాటగా కడుపులో పురుగులు చనిపోవాలంటే మద్య పానం చెయ్యాలని అర్థమైనా, వాతావరణాన్ని హాస్యం పండేలా ప్రజలు చెప్పేవారు.

ప్రతి శోధయాత్రలో మాదిరిగానే ఈ యాత్ర కూడా మేము ఆయా ప్రాంతాల వాతావరణ, భౌగోళిక పరిస్థితులు, ఆచారాలు, వ్యక్తుల మనస్తత్వాల కలయికతో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకొన్నాం. అదేవిధంగా ఇతర శోధయాత్రికులతో కలిసిన అనుభవాలు, సేకరించిన విజ్ఞానం వారికి అందజెయ్య గలిగాం అన్న తృప్తితో ఈ యాత్రను సంతోషంగా ముగించాం.

**సమాప్తం**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అర్ధచంద్రాకారపు చెక్ డ్యామ్‌ల సృష్టికర్త



గుజరాత్‌కు చెందిన భాంజీభాయ్ మథుకియా అనే రైతు ఆవిష్కర్తను ఆ ప్రాంత రైతులు తమకు నీటి కొరకు నానాటికీ పెరిగి పోతోందని, వాగుల్లోని నీటిని ఆదా చేయటం గురించి ఏదైనా చెయ్యమని విన్నవించుకున్నారు. అందుకు భాంజీభాయ్ ఆ ప్రాంతంలో లభించే రాళ్ళను ఉపయోగించి, ఆయా గ్రామస్తుల శ్రమదానంతో తక్కువ ఖర్చుతో అర్ధ వృత్తాకారంలో ఉండేలాగా చెక్ డ్యామును నిర్మింపజేశాడు.

అతని ఆలోచన ప్రకారం, తనకున్న సృజనాత్మక ఆలోచనతో వరుసగా అర్ధ వృత్తాకారం వచ్చేలా నిర్మించిన ఈ మాడ్యులర్ చెక్ డ్యామ్ ఉంటుంది. భాంజీభాయ్‌కి ఈ ఆలోచన బ్రిటీష్ కాలంలో నిర్మించిన రైల్వే వంతెనల నిర్మాణం, వాటి బలం మరియు మన్నిక నుండి ప్రేరణ పొందాడు. అతను స్థానికంగా లభించే రాళ్ళు, ఆనకట్ట నిర్మించటానికి ఒక తాపీ మేస్త్రీ మరియు నలుగురు కార్మికుల సహాయంతో తక్కువ ఖర్చుతో కూడిన ఈ ఆనకట్టను కేవలం 4 రోజుల్లో, 10 వేల రూపాయల ఖర్చుతో నిర్మించారు. ఇప్పుడు ఈ ఆనకట్ట ఈ ప్రాంతాన్ని పచ్చని సర్గధామంగా మార్చింది.

## వినూత్న 'చెక్ డ్యామ్'ల నిర్మాణం

భాంజీభాయ్ నిర్మించిన ఈ చెక్ డ్యాంను చూసిన గుజరాత్ రాష్ట్రానికే చెందిన, 'వృక్షమిత్ర'గా పేరు గడించిన ప్రేమ్‌జీ భాయ్



ఇలాంటి చెక్ డ్యాంలను అనేక గ్రామాలలో నిర్మించాడు.



గుజరాత్ లోని జునాగఢ్ కు చెందిన 'వృక్ష మిత్ర' ప్రేమ్‌జీ భాయ్ అనే ఈ సృజనాత్మక రైతు ఒక ట్రస్టును ఏర్పాటు చేసుకుని, తన అనుభవంలో నేరుగా ఉండే చెక్ డ్యాములకన్నా, అర్థ వృత్తాకారంలో కట్టిన చెక్ డ్యాములు ఎక్కువ సామర్థ్యం, మన్నికతో ఉండటమే కాక, చూపరులకు కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి అని తాను 'వృక్ష ప్రేమ్ ట్రస్ట్' ను స్థాపించి దాని ఆధ్వర్యంలో ఇప్పటికి 2,000కు పైగా చెక్ డ్యామ్‌లను నిర్మింపజేశాడు. ఆ ప్రాంతంలో ఎవరు చెక్ డ్యాములు నిర్మించుకోవాలని ఈ ట్రస్ట్‌ను సంప్రదిస్తే, చెక్ డ్యామ్‌కు అవసరమైన రాళ్ళు, ఇసుక లాంటి వాటిని ఏర్పాటు చేసుకుని, ఆ గ్రామస్తులే స్వయంగా తమ శ్రమదానంతో నిర్మించుకోవాలంటే, వారికి అవసరమైన సిమెంట్‌ను, డిజైన్‌ను ఈ ట్రస్టు అందజేస్తుంది.

చెక్ డ్యాములు అనేవి రైతుకు ఎంతో ఉపయోగకరమైనవి అని, వీటి ద్వారా నీటి ఆదా జరగటమే కాక, భూమిలో నీటి పొరలను జీవింప జేస్తుందని, భూగర్భ జల శాతం ఎక్కువ అయ్యే అవకాశాలు చాలా మెండుగా ఉంటాయని అంటారు. కాబట్టి చెక్ డ్యామ్‌లను నిర్మించటానికి ప్రభుత్వాలు మాత్రమే ముందుకు రావాలని ఆశించకుండా, వీటి ద్వారా బాగు పడేది రైతులే కాబట్టి వారే వారి గ్రామాల్లోని రైతులతో చర్చించి, తామే స్వయంగా పూనుకుని చెక్ డ్యాములను నిర్మించుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకొరకు ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ఎంతో కొంత ఆర్థిక సహాయం అందించేందుకు ముందు వస్తున్నాయని, వాటిని సంప్రదించి తమ గ్రామాల్లో వీలైనన్ని చెక్ డ్యామ్‌లను ఈ విధంగా నిర్మించుకోవటం వల్ల తమ గ్రామ భూగర్భ జలాలు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని అంటున్నారు.

మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని నీటియెద్దడి గల గ్రామ ప్రజలు కూడా తమ గ్రామ సమీపలోని వాగులు, వంకల్లో తమ ప్రాంతంలోని స్వచ్ఛంద సంస్థలు, సహృదయం గల దాతలు, నాయకుల ప్రోత్సాహంతో మీరే స్వయంగా ఇలాంటి చెక్ డ్యాంలను నిర్మించుకుని, మీ గ్రామాలలో కూడా భూగర్భ జలాలు అభివృద్ధి చెందేలా చేసుకోవాలిన కోరుకుంటోంది 'పల్లెసృజన'. ఇలా చేయటం వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందటమే కాక, పశు పక్ష్యాదులు కూడా నీటియెద్దడికి గురి కాకుండా వాటిని జీవింపజేసే అవకాశాలు మెండుగా ఉంటాయి. అలా చెక్ డ్యామ్‌లను నిర్మించుకోవాలనే గ్రామీణులు, రైతాంగానికి ఇందుకు అవసరమైన డిజైన్‌ను, నమూనాను అందించేందుకు 'పల్లెసృజన' తప్పక సహకరిస్తుందని తెలియజేస్తున్నాము.

భూగర్భ జలాలను పెంచేందుకు ఉపయోగ పడే ఇలాంటి చెక్ డ్యామ్‌ను రూపొందించిన 'భాంజీభాయ్ మధుకియా'కు మరియు అనేక చెక్ డ్యామ్‌లను నిర్మింప జేసిన 'వృక్షమిత్ర ప్రేమ్‌జీభాయ్' గార్లను ఎన్ఐఎఫ్ తన ద్వైవార్షిక పోటీలలో రాష్ట్రపతి పురస్కారాలను అందజేసి వారిని ప్రోత్సహించింది.



విశేషాలు

# జులై-ఆగస్టు 2025 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు





25 జులై, 2025న మహారాష్ట్రకు చెంది ప్రతినిధి బృందం 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించారు. ఆ రోజంతా కార్యాలయం లోనే గడిపి, పునాది స్థాయి ఇన్నోవేషన్లను గురించి, ఇన్నోవేటర్లను గురించి, పల్లెసృజన వాటిని వెలుగులోకి తీసుకు వచ్చిన విధానాన్ని గురించి క్షుణ్ణంగా పరిశీలించారు.



20-8-2025 నడు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం లోని బిలాస్‌పూర్ జిల్లా, బైకుంత్పూర్ గ్రామంలో స్థానిక కెవికె వారు నిర్వహించిన ఒక కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్ మహిపాల్ చారి తన వీడర్‌ను ప్రదర్శించి, రైతులకు శిక్షణ ఇవ్వటం జరిగింది. ఆ ప్రాంత రైతుల మెప్పు పొందిన మహిపాల్ వీడర్‌కు భవిష్యత్తులో అక్కడి నుండి ఆర్డర్లు వచ్చే అవకాశముంది.




30 సంవత్సరాల క్రితం అమరావతి సమీపంలోని 'తాడికొండ' గ్రామానికి చెందిన 'మున్నంగి నారాయణ రెడ్డి మరియు లూథర్ పాల్' అనే ఇద్దరు మిత్రులు రూపొందించిన చిన్నకారు రైతులకు ఎంతో ఉపయోగ పడేలా ఒకే సాధనంలో గొర్రు, గుంటక నేటికీ రైతులకు ఎంతో ఉపయోగ పడుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన ఎన్ఐఎఫ్ ఈ పరికరానికి జాతీయ స్థాయి గుర్తింపును ఇచ్చారు. ఇన్నోవేటర్లు ఇద్దరూ మరణించిన తర్వాత నేటికీ రైతులు ఆదరిస్తున్న ఈ ఇన్నోవేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావటం ఇన్నోవేటర్ల ప్రతిభకు నిదర్శనం.



'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఇన్నోవేటర్ శివచంద్ర ప్రసాద్ రూపొందించిన 'చీరల రోలింగ్ యంత్రం'ను గుర్తించిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) వారు ఈ యంత్రాన్ని గ్రంథస్తీకరించి (డాక్యుమెంటేషన్) జాతీయ స్థాయిలో దీనికి గుర్తింపునిచ్చారు.




11-8-2025 న హైదరాబాద్ లోని హైటెక్స్ లో 'తెలంగాణ ఇన్నోవేషన్ సెల్' వారి ఆధ్వర్యంలో "ఆగస్ట్ ఫెస్ట్" పేరున ఒక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 'పల్లెసృజన' తెలంగాణ ఇన్నోవేటర్లు వెల్లె శ్రీనివాస్, గొర్రె అశోక్, శశిధర్, శ్యాంబాబు, దీపక్ రెడ్డి, సత్యనారాయణలు, పావంటీర్లు పాల్గొన్నారు.




'కొమెర అంకారావు' (జాజి) తాను నిర్వహిస్తున్న "5 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం"లో భాగంగా 12-8-2025 నాడు పల్నాడు జిల్లాలోని వినుకొండ పట్టణం లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేత పాఠశాలలోని మైదానంలో మొక్కలు నాటించి, ఆ మొక్క పేర్లు, దాని ఉపయోగాలు, దాని ఔషధ గుణాలను, పూర్వం ఈ మొక్కలను ఎలా ఉపయోగించుకునే వారు తదితర రహస్యాలను గురించి 'ప్రకృతి పాఠం'గా విద్యార్థులకు వివరించారు.



15-8-2025 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "ముప్పారపు రాజు" ఇన్నోవేషన్‌కు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఫర్మేషన్ & టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ డి. శ్రీధర్ బాబు గారు అతని మెడలో ప్రభుత్వ గుర్తింపు కార్డును అలంకరించడం జరిగింది.




15-8-2025 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ గారు ఇచ్చిన ఆహ్వానం మేరకు రాజ్‌భవన్‌లో ఇచ్చిన తేనీటి విందులో 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన ఆ రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణం, అడవుల అభివృద్ధి సలహాదారు 'కొమెర అంకారావు' పాల్గొని, గవర్నర్ గారికి తాను రచించిన "ప్రకృతి ఆహారం" పుస్తకాన్ని బహూకరించినప్పటి చిత్రం.




3-9-2025 న హైదరాబాద్ గుర్రంగడ్డకు చెందిన 'కిడ్‌జీ' పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు, 3 ఉపాధ్యాయులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ సుభాష్ చందర్ వాటిని గురించి వివరిస్తూ, ప్రదర్శించిన పునాది స్థాయి ఇన్నోవేషన్లను చిన్నారులు సంభ్రమాశ్చర్యాలతో తెలుసుకోవటం జరిగింది.

# యువత అవగాహనకై ప్రకృతిలో లభించే చెట్ల పేర్లు సంస్కృతం మరియు తెలుగు భాషల్లో

**సేకరణ : పర్యావరణ వేత్త "కొమెర అంకారావు (జాజి)"**



మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేటి యువతకు చాలా వరకు చెట్ల పేర్లు తెలియటం లేదు. వాటిని పిల్లలకు తెలియజేసే వారు కూడా కరువయ్యారు. ఈ విషయం అవగాహన చేసుకున్న పర్యావరణవేత్త "కొమెర అంకారావు (జాజి)" పల్లెసృజనకు తాను సంస్కృతం మరియు తెలుగు లో సేకరించిన చెట్ల పేర్లను తెలియజేస్తున్నాడు. వీటిని మీ చిన్నారులచేత తప్పక చదివించండి. వీలైతే మీ పరిధిలో వారు అడిగిన చెట్లను చూపించండి. ఇలా చేయటం వల్ల ప్రకృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో వారికి చెట్లపైన అవగాహన పెరిగి, పర్యావరణం రక్షించడానికి దోహద పడుతుంది. **చెట్ల పేర్లు (గత సంచిక తరువాయి)** **- ఎడిటర్**

| వ.సం. | సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|---|
| 713 | వితండ | - | చామ చెట్టు |
| 714 | విదరం | - | నరాగజెముడు |
| 715 | విదారగంధా | - | ముయ్యాకు పొన్న |
| 716 | విధారీ | - | నేల గుమ్మడి చెట్టు |
| 717 | విద్రుమలత | - | పగడపు తీగె చెట్టు |
| 718 | విబీతకి | - | తాడి చెట్టు |
| 719 | వీరేచన ఫల | - | దేశవాళి గోంగూర |
| 720 | విశాలత్వక్ | - | ఏడాకుల పొన్న |
| 721 | విశ్వగ్రంది | - | హంసపాది |
| 722 | విశ్వ తులసి | - | కుక్క తులసి |
| 723 | విశ్వరూపి | - | మార్కొండ చెట్టు |
| 724 | విశ్వసార | - | నాగజెముడు |
| 725 | విశ్వామిత్ర ప్రియ | - | కొబ్బరిచెట్టు |
| 726 | విష | - | నాభి |
| 727 | విషగంధీక | - | గాడిద గడపాకు |
| 728 | విషఘ్ని | - | విషముష్టి గించలు |
| 729 | విషమండల | - | విషమంగలపు చెట్టు |
| 730 | విషముష్టి | - | విషముష్టి గింజలు |
| 731 | విషాణి | - | రుషభకమను మూలిక |
| 732 | విషాది | - | తెల్ల గలిజేరు |
| 733 | విషావహ | - | సీమ చిరతమూలం |
| 734 | విష్ణుకాంత | - | విష్ణుకాంత చెట్టు |
| 735 | విష్ణు వల్లభ | - | కృష్ణతులసి |
| 736 | విసర్పిని | - | ఈశ్వరి చెట్టు |

| వ.సం. | సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|---|
| 737 | వారణార్జున | - | అవురు గడ్డి |
| 738 | వీర సేన | - | ఆలు బఖారా |
| 739 | వృత తండుల | - | జొన్నలు |
| 740 | వృద్ధ తారక | - | వృద్ధ దారు |
| 741 | వృషభ | - | రుషభకమను మూలిక |
| 742 | వృష్య కంద | - | నేల గుమ్మడి చెట్టు |
| 743 | వృక్షగంధిని | - | బలుసు చెట్టు |
| 744 | వృక్షబక్ష | - | బదనిక |
| 745 | వృక్షరుహ | - | హబదనిక |
| 746 | వృక్షామ్ల | - | చింత చెట్టు |
| 748 | వేణు | - | వెదురు |
| 749 | వేణు విస్వస | - | అడవి చెరుకు |
| 750 | వేణు బీజ | - | వెదురు బియ్యం |
| 751 | వేతస | - | ప్రబ్బలి చెట్టు |
| 752 | వేత్ర | - | వేప పండు |
| 753 | వైతవీ | - | తవాక్షరీ |
| 754 | వైద్యమాత | - | అడ్డసరము |
| 755 | వ్యంజన | - | పుదీనా |
| 756 | వ్యాఘరీ | - | వాకుడు చెట్టు |
| 757 | వ్రాణగను | - | మురరారు సింగు |
| 758 | శంకజీర | - | శంకజీరకము |
| 759 | శంఖపుష్పి | - | శంక పుష్పము |
| 760 | శుక్రదారు | - | భద్ర దేవదారు |
| 761 | శణ | - | జనప చెట్టు |
| 762 | శతపత్రి | - | గులాబీ పువ్వు |

| వ.సం. | సంస్కృతం | – | తెలుగు |
|---|---|---|---|
| 764 | శతపర్వికా | – | గరిక వేళ్ళు |
| 765 | శతపుష్ప | – | సదాప చెట్టు |
| 766 | శతపుష్ప | – | పిన్నసదాప |
| 767 | శత ప్రసూనా | – | సోపు |
| 768 | శతవేధి | – | ఆమ్ల వేతనము |
| 769 | శతాహ్వే | – | పోయికూర |
| 770 | శమీ | – | జమ్మిచెట్టు |
| 771 | శమిపత్ర | – | నిద్ర గన్నిక |
| 772 | శరపుంఖ | – | వెంపలి చెట్టు |
| 773 | శల్యదా | – | మేదా |
| 774 | శల్లకీ | – | అందుగ చెట్టు |
| 775 | శసాందులి | – | చేదు దోసకాయ |
| 776 | శాఖవీర | – | పెరుగుతోటకూర |
| 777 | శాఖ వృక్ష | – | టెకు చెట్టు |
| 778 | శాకోట | – | తపసి చెట్టు |
| 779 | శాఘోట | – | బరి వెంకచెట్టు |
| 780 | శాలిపర్ణీ | – | మయ్యాకు పొన్న |
| 781 | శాల్మలీ | – | బూరుగ చెట్టు |
| 782 | శిదుగందా | – | పొగడ చెట్టు |
| 783 | సింబి | – | అనుములు |
| 784 | శింశుప | – | ఇరుముడి చెట్టు |
| 785 | శిఖండి | – | గురివింద చెట్టు |
| 786 | శిఖండిని | – | అడవి మొల్ల |
| 787 | శిఖనీ | – | మయూర శిఖ |
| 788 | శిగృ | – | మునగ చెట్టు |
| 789 | శితార్ణక | – | తులసి |
| 790 | శితివార | – | చంచలకూర |
| 791 | శితశుక | – | యవలు |
| 792 | శిరీష | – | దిరిసేన చెట్టు |
| 793 | శిలాగర్భజ | – | పిండి కొండ చెట్టు |
| 794 | శివమల్లి | – | యోచన |
| 795 | శీత పుష్ప | – | దువ్వెన చెట్టు |
| 796 | శీత సార | – | పొన్నగంటి కూర |
| 797 | శీతాఫల | – | శీతాఫలం చెట్టు |
| 798 | శుఖ వల్లభ | – | దానిమ్మ చెట్టు |
| 799 | శుకశృద | – | మాచిపత్రి |
| 800 | శుకా శింబీ | – | పెద్ద దూలగొండి |
| 801 | శుచికా పుష్ప | – | మొగలి పువ్వు |
| 802 | శృంగటకీ | – | కోవిలదుంప |
| 803 | శృంగాలవిన్న | – | కోలపొన్న చెట్టు |
| 804 | శేలు | – | నక్కెర చెట్టు |
| 805 | శైలేయ | – | అడవిసదాప |
| 806 | శోకనాశ | – | అశోక వృక్షము |
| 807 | శోనాక | – | దుందిలపు చెట్టు |
| 808 | శోభఘ్ని | – | ఎఱ్ర గలిజేరు |
| 809 | శోభహార | – | జీడిమామిడి చెట్టు |

| వ.సం. | సంస్కృతం | – | తెలుగు |
|---|---|---|---|
| 810 | శోభాంజన | – | మునగ చెట్టు |
| 811 | శోలి | – | అడవి పసుపు |
| 812 | శ్యామబీజ | – | కాటక గింజలు |
| 813 | శ్యామక | – | చామలు |
| 814 | శ్రావణి | – | తెల్ల బఓడతరము |
| 815 | శ్రీపర్ణి | – | గుమ్ముడు చెట్టు |
| 816 | శ్రీఫల | – | మారేడు చెట్టు |
| 817 | శ్రీమతి | – | విరజాజి పుష్పము |
| 818 | శ్రీమాన్ | – | తిలకపు చెట్టు |
| 819 | శ్రీవేష్టక | – | గంధ ఫేరోజా |
| 820 | శ్రీవాస | – | దేవదారు తైలం |
| 821 | శ్లక్ష్ణజీర | – | ఇనుపగోలు గింజలు |
| 822 | శ్లేష్మాంతక | – | నక్కెర చెట్టు |
| 823 | శ్వాఘోట | – | బరివెంక చెట్టు |
| 824 | శ్వాస జీహ్వే | – | ఆకు జెముడు చెట్టు |
| 825 | శ్వేత అపరాజిత | – | తెల్ల దింటేన |
| 826 | శ్వేత కుండలి | – | తెల్ల ఉప్పి |
| 827 | శ్వేత కదిర | – | తెల్లచంద్ర |
| 828 | శ్వేత గిరికర్ణిక | – | తెల్ల దింటేన |
| 829 | శ్వేత నిర్గుండి | – | తెల్ల వావిలి |
| 830 | శ్వేతపత్రి | – | తెల్ల గులాబీ పువ్వు |
| 831 | శ్వేత బిందుక | – | అనుములు |
| 833 | శ్వేత రాజి | – | పొట్ల చెట్టు |
| 834 | శ్వేతక్ష | – | తెల్ల చెరుకు |
| 835 | శ్వేతర్కా | – | తెల్ల జిల్లేడు |
| 836 | షడ్పదాలయ | – | పొన్నచెట్టు |
| 837 | షుద్భుజా | – | ఖర్జూర పండు |
| 838 | సజీవని | – | అడవి శెనగ చెట్టు |
| 839 | సంధ్యకాలి | – | చంద్రకాంత చెట్టు |
| 840 | సదాపుష్ప | – | మొల్లల పుష్పములు |
| 841 | సప్తచ్ఛద | – | ఏడాకుల పొన్న |
| 842 | సప్తపర్ణి | – | ఏడాకుల పొన్న |
| 843 | సప్తలా | – | సాంబ్రాణి చెట్టు |
| 844 | సాతలా | – | సంబరేణు |
| 845 | సమంత దుగ్ధ | – | కత్తిమందు చెట్టు |
| 846 | సరల | – | సరళ దేవదారు |
| 847 | స్వర్ణ | – | ఏపి చెట్టు |
| 848 | సర్పగంధా | – | సర్పాక్షి చెట్టు |
| 849 | సర్పగంధా | – | విటముంగి తీగలు |
| 850 | సర్పాక్షి | – | సర్పాక్షి చెట్టు |
| 851 | సర్ప గ్రంధి | – | పిప్పిలి మూలము |
| 852 | సర్వజయా | – | కృష్ణ తామర |
| 853 | సహదేవి | – | సహదేవి |
| 854 | సహస్ర వీర్యా | – | తెల్ల గరిక |

**(వచ్చే సంచికలో మరికొన్ని చెట్ల పేర్లు)**

**(మరిన్ని వివరాలకు, తప్పు ఒప్పులకు కొమెర అంటారావు (జాజి) గారిని సంప్రదించండి**
**ఫోన్ : 9908411700**




# డా. ఎపిజె అబ్దుల్ కలాం 'చిన్న పిల్లల సృజనాత్మక మరియు ఇన్నోవేషన్ పురస్కారాలు-2023

- 'హనీబీ' పత్రిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

దా. ఎపిజె అబ్దుల్ కలామ్ గారి పేరిట ప్రతి సంవత్సరం 12వ తరగతి పిల్లల వరకు మరియు ఏమీ చదువుకోకపోయినా, చదువు ఆపేసిన 19 సంవత్సరాల పిల్లల నుండి వారి సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్‌లకై దరఖాస్తులు స్వీకరించ బడతాయి. ఈ పురస్కారాలు చిన్న పిల్లలలో ఇతరుల కష్టాల గురించి సంవేదన పడటం, స్థానిక ప్రజల సమస్యలకి పరిష్కారాలు కనుగొనటం, తద్వారా సామాజిక అవసరాలను తీర్చటం దృష్టిలో పెట్టుకొని నిర్వహించ బడతాయి.

ఈ పోటీ కేవలం ఉపన్యాసాలు వినటం కొరకు మాత్రమే కాదు, చిన్న పిల్లలకి చాలా మంచి ఆలోచనలు వస్తాయి అన్న తత్వంపై ఆధారపడి ఉంది. ఇటువంటి చురుకైన ఆలోచనలు చేసే పిల్లలను గుర్తించి సమాజానికి పనికి వచ్చే వారి ఆలోచనలను సేకరించి, వారికి తగిన గుర్తింపు, పురస్కారాలు అందజెయ్యటానికి 'గ్యాన్, శ్రిష్టి, హెచ్‌బిపి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తునే ఉంటుంది. 2023వ సంవత్సరానికి గాను "ఇగ్నైట్" పేరిట జరిగిన పోటీలలో గెలుపొందిన చిన్న పిల్లల ఆలోచనలు, ఆవిష్కారాల వివరాలలో కొన్ని మీ ముందుంచుతున్నాము.

-ఎడిటర్

## అభివృద్ధి చేయబడ్డ ఎల్ఇడి లైట్ (ఖర్చులు తగ్గించి, చాలా కాలం పని చేసే జిఎల్ఇడి బల్బులు):

ఆదిత్యరాజ్ చోప్రా, 10వ తరగతి, డిపిఎస్ ఇందిరాపురం, ఘజియా బాద్, ఉత్తరప్రదేశ్.



ఎల్ఇడి బల్బులు వచ్చాక మామూలు బల్బులకన్నా కొంచెం ఎక్కువ ఖరీదైనా వాటినే వాడటం అలవాటైపోయింది. ఎక్కువ కాంతినివ్వటం, తక్కువ కరెంటు ఖర్చు కావటం దీనికి ముఖ్య కారణాలు. ఈ ఎలివెంటింగ్ ఎల్ఇడి బల్బులలో ముఖ్యంగా, తిరిగి




నడవగలిగిన బల్బు, బుగ్గ, డిస్పోజబుల్ క్యాప్ (తెల్లని ప్లాస్టిక్ టోపి లాంటిది) మార్చుకోగలిగిన (పిసిబిఎ- ఎల్ఇడి) ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుని లైట్ ఎమిటింగ్ డయోడ్‌లు, ఈ ఎల్ఇడి బల్బు వెలగక పోతే (పని చెయ్యటం మానేస్తే) దానిలో ఉండే చాలా పిసిబిఎ-ఎల్ఇడి దండలోని




బల్బు చెడిపోతే మొత్తం బల్బుని పడేయటం కన్నా ఆ చెడిపోయిన పిసిబిఎ ఎల్ఇడిని చేతితో తీసేసి దాని స్థానంలో ఇంకొకటి పెట్టుకుంటే బల్బు తిరిగి వెలుగుతుంది. (సెల్ ఫోన్ సిమ్ కార్డుని మార్చినట్టు).

దీనివలన ఖర్చులు తగ్గుతాయి. బల్బు మెత్తం పడేయవలసిన అవసరం లేకుండా ప్లాస్టిక్ అల్యూమినియమ్ భాగాలు పడిపోకుండా, చెత్తలో కలిసి, కాలుష్యం పాడవకుండా అతి చిన్న భాగం మార్చి బల్బుని తిరిగి పని చేసుకోవచ్చన్నది ఆదిత్యరాజ్ చోప్రా ఆలోచన.

### డెక్సా బోట్ - చేతులతో తినలేని వారికి సహాయపడే పరికరం

**ఆర్జిత్ మహజ,** 12వ తరగతి, నాడార్ స్కూల్, నోయిడా, ఉత్తరప్రదేశ్.



చాలామంది వయస్సు పైబడిన వారు, జబ్బు చేసిన వారు, నరాల బలహీనత ఉన్నవారు చేతులు వణకటంతో తమ దైనందిక పనులు సజావుగా, గౌరవప్రదంగా నిర్వహించుకోవటానికి సహాయపడే పరికరమే 'డెక్సాబోట్'. చేతులు వణికి తినలేక పోవటం, చెంచాలు పట్టుకోలేక పోవటం, పట్టుకొన్నా దానిలోని పదార్థం



క్రింద పడిపోవటం జరగకుండా నివారి స్తుందీ పరికరం. నలుగురి ముందు అభాసుపాలు కా కుండా, గౌరవంగా నడుచు కోవటానికి రోగగ్రస్తుల వ్యక్తి త్వంపై ప్రతికూల ప్రభావం పడకుండా సహాయపడుతుందీ 'డెక్సా బోట్'.

### చూపు లేనివారు ఇంట్లో తిరగటానికి సహాయపడే పరికరం (స్మార్ట్ ఫోన్‌కు అనుసంధానం చెయ్యాలి):

**ఉదయ్‌శంకర్, రవికుమార్,** 9వ తరగతి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపన్ స్కూలింగ్, ఎర్నాకులం, కేరళ.





కనుచూపు లేనివారు తమ ఇళ్ళల్లో వెళ్ళదలచిన గదికి, ప్రదేశానికి వెళ్ళడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వారి పని సులువు చెయ్యటం కోసం రవికుమార్ స్మార్ట్ ఫోన్‌తో అనుసంధానం చేసేలా ఒక అప్లికేషన్ రూపొందించాడు. దీని సహాయంతో ఆ ఫోన్ చెప్పిన విధంగా వింటూ తాను నిర్ణయించు కున్న గమ్యానికి చేరుకోవచ్చు. ముందుగా సమాచారాన్ని ఆ ఫోన్‌లో నిక్షిప్తం









చేస్తే అంటే గోడలు, ద్వారాలు, మెట్లు, బల్లలు, అడ్డంకులు లాంటి మొత్తం డాటాను, ఫోన్‌లోని 'ఆప్'లోకి ఎక్కించి పెడితే వాడుకొనే వారు ఎక్కడికి వెళ్ళాలో చెపితే (మాటలలో) అక్కడ ఉన్న అడ్డంకులు, దిశ, చెప్పి అతడ్ని గదికి, ప్రదేశానికి, బాత్రూంకి .... తీసుకొని వెళ్ళే మార్గం చూపుతుంది. అది వింటూ తాను నిర్దేశించిన ప్రదేశానికి సునాయాసంగా వెళ్ళిపోవచ్చు.

### రోడ్డు డివైడర్‌లో తాత్కాలికంగా మార్గం చేసే పద్ధతి:



మనం రహదారిపై వెళుతుంటే చాలాసార్లు మనం వెళ్ళే వైపు రద్దీ ఎక్కువగా ఉండి, డివైడర్‌కి అవతల వైపు ఖాళీగా ఉండటం చూస్తుంటాం. అప్పుడనిపిస్తుంది ఈ డివైడర్‌లో చిన్న మార్పు చేస్తే అవతల వైపు లేన్‌లో నుండి వెళ్ళి ఈ రద్దీ నుంచి బయట పడవచ్చు కదా అని. ఈ సమస్య పరిష్కారానికి ఎక్కడికైనా తీసుకుని వెళ్ళి రోడ్డు డివైడర్ మధ్య బిగించి (ఇది ముందే బిగించి ఉండాలి) అవసరం అయినప్పుడు తెరిస్తే, డివైడర్ మధ్య నుంచి మార్గం ఏర్పడి రద్దీలో ఉండే కొన్ని వాహనాలు రద్దీ లేని మార్గంలోకి వెళ్ళే అవకాశం ఉంది. దీన్ని రిమోట్‌తో కూడా పని చేయించవచ్చుననేది వీళ్ళ ఆలోచన.



### కోడ్ భాష:

ఏదైనా చదవటానికి, అర్థం చేసుకోవటానికి స్పష్టంగా వివరించటానికి మాతృభాష, తమ స్థానిక భాష చాలా సులువుగా ఉంటుంది. సైన్స్ చదివే వారికైతే మరీ బాగుంటుంది. మరి కంప్యూటర్లపై కోడింగ్ చేసే వారిని గురించి ఆలోచించండి. వారికి ఇంగ్లీషు భాష రాకపోవటం వలన, వారు సమర్థవంతంగా పని చేసి చక్కని కోడింగ్‌లు చెయ్యలేక పోతున్నారు. దానివలన చాలా మంది, సాంఘికంగా దేశానికే కాక కంప్యూటర్ రంగానికి కూడా చాలా నష్టం జరుగుతోంది. అదే తన స్థానిక భాష లేదా మాతృభాషలో కోడింగ్ చేసే సదుపాయం ఉంటే ఎంత అభివృద్ధి జరుగుతుంది. ఎన్నో కొత్త ఆలోచనలు వస్తాయి. కోట్లాది మందికి మేలు జరుగుతుంది. అందుకే ఉదయ శంకర్ రవికుమార్





స్థానిక భాషలో కోడింగ్ చెయ్యటానికి వీలుగా ఒక అప్లికేషన్ ఉంటే బావుంటుందని భావిస్తున్నాడు.

### మూర్ఛ రోగం ఉన్న వారికి ఉపయోగ పడే పరికరం (చేతికి ధరించ వచ్చు లేదా మెడలో వేసుకోవచ్చు):



**సాయాన్స్ టపూరియా,** 8వ తరగతి, ద శ్రీరామ్ స్కూల్, గుర్గామ్, హర్యానా.

మూర్ఛ రోగం ఉన్న వారికి ఎప్పుడు, ఎక్కడ మూర్ఛ వస్తుందో చెప్పటం చాలా కష్టం. వారికి ఎల్లప్పుడూ తోడుగా ఎవరో ఒకరు సహాయకులు ఉండాల్సి ఉంటుంది. ఉన్నవారు ఎప్పుడూ రోగి ప్రక్కనే ఉండటం కుదరదు. పక్కన ఎవ్వరూ లేనప్పుడు రోగికి మూర్ఛ వస్తే సహాయకులకు తెలియజెయ్యటానికి 'సాయాన్స్' రూపొందించిన ఈ పరికరం చాలా బాగా పనికి వస్తుంది. దానిలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి చేతి గడియారంలా రోగి చేతికి కట్టి ఉంచటానికి, రెండవది రిసీవర్. రోగికి మూర్ఛ వస్తే అతను ధరించిన వాచీ లోని సెన్సార్ సహాయంతో సహాయకుడి వద్ద వున్న రిసీవర్‌లో అలారం మోగుతుంది. దీంతో అతను అప్రమత్తమై రోగి దగ్గరకి త్వరగా చేరుకొని సహాయం పడవచ్చు. దీనివలన రోగితో పాటు సహాయకుడు కూడా నిశ్చింతగా ఉండవచ్చు.






**అణుశ్రవణ్ (దొంగ రవాణా సమాచారం అందించే పరికరం) :**

**తుహీన్ భట్టాచార్‌జీ** , 11వ తరగతి, పబ్లిక్ స్కూల్, ధన్‌బాద్, ఝార్ఖండ్.



అణుశ్రావణ్ అనే పద్ధతిలో సహజ వనరులు, ఎర్రచం దనం, బొగ్గు మొదలైనవి రవాణా చేసేటప్పు డు ఈ వ్యవస్థ బాగా పని చేస్తుంది. అంతే కాక వాహనానికి ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ మరియు కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తుంది.

ఈ పద్ధతిలో వాహనంలో సరుకు ఎక్కించగానే దాని బరువును నమోదు చేసుకుంటుంది. వాహన కదలికలను దాని బరువునీ, జిపిఎస్ పద్ధతి ద్వారా అది ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియజేస్తూ ఉంటుంది. దారిలో బరువులో ఏ మాత్రం మార్పు వచ్చినా, పెరిగినా, తగ్గినా, నిర్ణయించిన మార్గం గుండా కాకుండా వేరే మార్గంలో వాహనం దారి మళ్ళినా వెంటనే నియంత్రణ కేంద్రానికి సమాచారం అందిస్తుంది. అంతే కాక వాహనానికి ఇంధనం సరఫరా ఆపేసి, డ్రైవర్‌కి హెచ్చరిక చేస్తుంది. ఇది రవాణా రంగంలో చాలా ఉపయోగకారిగా ఉంటుంది.





**గర్భిణీ స్త్రీలు బస్సుకోసం వేచివున్నారని, బస్సు కండక్టరుకు తెలియజేసే పరికరం :**

**రిషితా సమంతారే** , 8వ తరగతి, కెఐఐటి ఇంటర్నేషనల్ స్కూల్, భువనేశ్వర్, ఒడిస్సా.



చాలా సందర్భాలలో గర్భిణీ స్త్రీలు బస్సుకోసం వేచి చూడటం, బస్సులు ఆగకుండా వెళ్ళిపోవటం అసలు బస్సులో గర్భిణీ మహిళ ఉన్నదని డ్రైవర్‌కి, కండక్టర్‌కి తెలియకపోవటం జరుగుతూ ఉంటుంది. రిషిత ఊహించిన పద్ధతిలో గర్భిణీ స్త్రీలు చాలా సుఖవంతంగా బస్సు ప్రయాణం చేసే వీలుంటుంది. ఈ పరికరం ప్రకారం బస్సు స్టాండులోకి రాకముందే కండక్టర్‌కి, డ్రైవర్‌కి సంకేతం అందుతుంది. ఎవరో గర్భిణీ మహిళ బస్సు స్టాండ్‌లో వేచి ఉందని, ఒకసారి ఆమె బస్సు ఎక్కిన తర్వాత దిగేంత వరకు ఆమె ప్రయాణం సుఖవంతంగా జరగటానికి సీటు ఇప్పించటం, బస్సు జాగ్రత్తగా నడపటం, అత్యవసరం అయితే బస్సుని నేరుగా ఆసుపత్రికి తీసుకు వెళ్ళటం లాంటిది చెయ్యటానికి వీలవుతుంది. (సశేషం)






# పల్లె జ్ఞానం

- 'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలిఫ్లవర్' పంటల అధికోత్పత్తి:**

ఒరిస్సాలోని నుందర్ ఘుర్ ప్రాంతంలోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజి పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి, మారాకు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తాయి. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి, అధికోత్పత్తిని సాధించాడు.



**కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం:**

పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్బర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను మెత్తగా దంచి, ఆ ముద్దను పశువుల



పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా దరి చేరకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా గుణం కనిపిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా పశువులకు ఉపశమనం కలిగించాడు.

**నిమ్మజాతికి చెందిన దబ్బ (కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ:**


ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహాంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (60 సం.) ఈ చెట్ల ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి, 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్ తయారు చేసి పశువులచేత తాగిపిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.





**ప్రత్తి నాటడంలో నర్సరీ పద్ధతి:**

గుజరాత్‌కు చెందిన కేశవ్‌భాయ్ 1999 నుండి తన పొలంలో 'శంకర్-4' అనే హైబ్రిడ్ ప్రత్తిని నాటేవాడు. వర్షాలు బాగుంటే ఫర్వాలేదు కాని, వర్షాభావ పరిస్థితుల్లో పొలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్తి మొక్కలు ఏపుగా పెరగక పోవడాన్ని గమనించాడు. ఈ సమస్య పరిష్కారం కొరకు అతను పొలంలో ప్రత్తి నాటినప్పుడే కొన్ని విత్తనాలను నర్సరీ పద్ధతిలో విడిగా కుండీలలో పెంచాడు. వీటిని 25 గ్రా. ఆవుపేడ, 50 గ్రా. మట్టి కలిపి అందులో మొక్కలు నాటేవాడు. తక్కువ ఎండ వుండేచోట వీటిని తగినంత నీరు పోసి 25 నుండి 30 రోజుల వరకు పెంచుతాడు.





ఈలోగా పొలంలో వేసిన ప్రత్తి మొక్కలలో ఏవైనా మొలకెత్తకపోయినా, లేదా సరియైన ఎత్తుకు ఎదగకపోయినా ఈ కుండీలలోని మొక్కలను అక్కడ నాటేస్తాడు. దాంతో పొలంలోని మొక్కలన్నీ ఒకే ఎత్తులో, ఒకే వయస్సులో వుండటం వల్ల ఒకేరకమైన కాపు ఇస్తున్నాయి. కేశవ్ భాయ్‌ని చూసి చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని చాలామంది రైతులు ఇదే పద్ధతిని అవలంభించి, వనరులను మితంగా వాడటమే కాకుండా, అధికోత్పత్తిని సాధిస్తున్నారు.

**పశువులు చూలుకు రావటానికి చిట్కా:**

పశువులలో వేడి అధికమైనపుడు అవి చూలుకు రాకపోవడమే కాదు, పాల దిగుబడి కూడా తగ్గుతుంది. దీనికి విరుగుడుగా గుజరాత్‌కు చెందిన భారత్ సిన్హా ఒక కిలో 'శతావరి' అనే ఔషధ మొక్క వేళ్ళు, ఒక కిలో మర్రిచెట్టు బెరడు కలిపి మెత్తగా పొడిచేసి రోజుకు 500 గ్రా.ల చొప్పున, నాలుగు రోజులపాటు పశువుకు దాణాలో కలిపి తినిపిస్తే మంచి ఫలితం వుంటుందని, ఒక వారంలో పశువు చూలుకు సిద్ధమవుతుందని అంటున్నాడు. ఈ చిట్కాను ఇతను తన తండ్రి రామ్‌సింగ్ భాయ్ వద్ద నేర్చుకున్నానని, ఆయనా ఇదే పద్ధతిని అవలంభించేవాడని చెబుతున్నారు.

**పశువులు తొందరగా 'మాయి' వేయటానికి మర్రి ఆకులతో వైద్యం:**

పశువులకు దూడ పుట్టిన తరువాత తల్లి కడుపులో నుండి తొందరగా మాయి బయటకు రాకపోతే తల్లి పశువుకు రక్తస్రావం, అంటులోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కనుక త్వరగా మాయి వేయటమన్నది కొన్ని గంటల్లో పూర్తి కావాలి. ఈ సందర్భంలో లేత మర్రి ఆకులను దంచి దానిలో 500 గ్రా. సజ్జపిండి, ఒక లీటరు పాలను కలిపి పశువుచేత తాగిపిస్తే మాయి తొందరగా వేస్తుంది.

ఇదే చికిత్సను స్త్రీలకు కూడా గర్భస్రావం అయితే కూడా ఉపయోగించవచ్చు అంటారామె. దీనివల్ల పునరుత్పాదక అవయవాల ఆరోగ్యం, అందం పుట్టడము మళ్ళీ సవ్యంగా జరుగుతాయట.) ●

## 20 యేళ్ళ 'పల్లెసృజన' చేసిన ప్రధాన నిర్ణయం..... మీ సలహాలు

'పల్లెసృజన' సంస్థను స్థాపించి వచ్చే నవంబరు మాసానికి 20 సంవత్సరాలు పూర్తి అవుతున్నది. ఈ సందర్భంగా పాఠకులకు బాధాతప్త హృదయంతో ఒక విషయాన్ని తెలియజేయాలి అనుకుంటున్నాము. 2006 లో ప్రారంభమైన 'పల్లెసృజన' పత్రిక మొదట త్రైమాసిక పత్రికగా వెలువడి ఆ తర్వాత 2010లో పాఠకుల కోరిక మేరకు 'ద్వైమాసిక' పత్రికగా వెలువరించటం జరిగింది. పత్రిక ప్రారంభమైన నాటినుండి నేటి వరకు పత్రికలో ఎటువంటి వ్యాపార ప్రకటనలు లేకుండా కేవలం చందాదారుల సహకారంతోనే ఈ పత్రికను కాస్త భారమైనా నిరాటంగంగా పత్రికను అందించ గలిగాము, మీ ఆదరణ చూరగొన గలిగాము అని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము

కానీ, జనవరి 2026 నుండి పత్రిక ముద్రణను మానేయాలి అనుకుంటున్నాము. అందుకు కారణం ముద్రణా ఖర్చులు పెరగటం, చందాదారు మేము ఆశించినంతగా పెరగక పోవటం, మా పత్రికా సంపాదక వర్గం అందరూ 63–75 సంవత్సరాల వయసు మీరిన వాళ్ళము కావటం చేత ఈ బాధాకరమైన నిర్ణయాన్ని తీసుకోవటం జరిగింది. కాబట్టి జనవరి నుండి 'పల్లెసృజన' పత్రిక ముద్రణ కాదు అని బాధాతప్త హృదయంతో తెలియజేసుకుంటున్నాము.

వీలైతే పత్రికను తయారు చేసి కేవలం 'సాఫ్ట్ కాపీ (పిడిఎఫ్) రూపంలో అందించాలన్న ఆలోచన చేస్తున్నాము. అందుకు కూడా కొంత వరకు ఖర్చవుతుంది. కానీ, అందుకు పాఠకులు సహకరిస్తే, సాఫ్ట్ కాపీ చందాదారులుగా చేర గలిగితేనే ఈ ప్రయత్నం కూడా ముందుకు సాగుతుందని విన్నవించుకుంటున్నాము. మేము తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మీ అభిప్రాయాలను తెలియజేయ వలసిందిగా కోరుతున్నాము. మీ అమూల్యమైన అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నంబర్లకు తెలియజేయ గలరు. **- జమ్మలమడక శశిమోహన్, ఎడిటర్**

**బ్రిగేడియర్ పోగుల గణేశం, వ్యవస్థాపక అధ్యక్షులు, ఫోన్ 9866001678: పల్లె వీరరాఘవ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి, ఎడిటోరియల్ బోర్డ్ సభ్యులు, ఫోన్: 8125799904.**

ఎటువంటి సహకారం పొందకుండా చేసిన పునాది సాంకేతిక ఇన్నోవేషన్‌లు మరియు
అత్యుత్తమ సాంప్రదాయ జ్ఞానంలో

# 15 వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

## మీవద్ద ఏదైనా తక్కువ ఖర్చుతో పర్యావరణానికి హాని చెయ్యని స్థిరమైన, మేలైన జీవితాలనిచ్చే ఆలోచన / ఇన్నోవేషన్ ఉన్నదా?

- వ్యవసాయం
- ఇంజనీరింగ్
- శక్తి (ఇంధనం)
- ఆరోగ్యం
- రోజువారి పనుల సహాయకారి
- పశువులు
- రవాణా
- మరేదైనా రంగలో శ్రమను తగ్గించి, ఉపాధి అవకాశాలను పెంచి, తద్వారా స్థిరమైన ప్రభావం చూపగలిగేవి

**ఎవరికీ ఆహ్వానం?**

సాంకేతిక ఇన్నోవేషన్‌లకి
సృజనాత్మక ఆలోచనలు
అత్యుత్తమమైన సాంప్రదాయ జ్ఞానం
(ఎవరి సహాయం లేకుండా స్వంతంగా చేసి, కొత్తగా ఉండి, శాస్త్రీయంగా నలుగురికి పనికి వచ్చేలా ఉండాలి)

ఎంపికైన ఇన్నోవేషన్‌లకి అభివృద్ధి చేసుకునేందుకు సహాయం అందజేయ బడుతుంది.

**ఎవరు పాల్గొన వచ్చును?**
పూర్తి వివరాలు తెలుసుకోవడానికి
ఈ క్రింది వెబ్‌సైట్ ను సంప్రదించండి
**https // nif.org.in/biannual_campaign**

అర్హత ఉన్న వ్యక్తులు, గుంపులు
ఎన్నైనా దరఖాస్తులు (పరిమితి లేకుండా)
ఈ క్రింది చిరునామాకు పంపవచ్చు.

**దరఖాస్తులు ఏడాది పొడవునా మార్చి 31, 2027 వరకు అంగీకరించబడును**

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation - India,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road,
Gandhi Nagar, Gujarat-382 721.
Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

राष्ट्रीय नवप्रवर्तन प्रतिष्ठान - भारत
National Innovation Foundation - India
An Autonomous Institute of Department of Science & Technology
Ministry of Science and Technology, Government of India

Follow us on

https://nif.org.in campaign@nifindia.org

# పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ - 2023

## 2వ ఇన్నోవేషన్ ఉత్సవాలు - కొత్త ఢిల్లీ



- 'హనీబీ' ఆంగ్ల సంచిక సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

కొత్త ఢిల్లీలోని ఐఐసి ఇండియా ఇంటర్‌నేషనల్ సెంటర్‌లో 2023 నవంబరు 28 నుండి డిసెంబర్ 2 వరకు జరిగిన రెండవ ఇన్నోవేషన్ ఉత్సవాలలో పాల్గొన్న ఇన్నోవేషన్‌ల సంక్షిప్త వివరాలు, జాతీయ స్థాయిలో జరిగే ఈ ఉత్సవంలో పాల్గొనటమే గొప్పగా భావిస్తారు ఇన్నోవేటర్లు. - ఎడిటర్

### అక్రోట్ కాయలు వొలిచే యంత్రం:

**జహీద్ రఫిక్ అహంగర్,**

అనంతనాగ్, జమ్ము & కాశ్మీర్.



**సమస్య:**

అక్రోట్ కాయలను చెట్ల నుంచి చేతితో కోసి, క్రికెట్ బ్యాట్ లాంటి చెక్కతో బద్దలు కొట్టి, పప్పును బయటకి తీస్తారు. ఈ పని చెయ్యటానికి చాలా మంది పని వారు అవసరమౌతారు, ఖర్చు, సమయం కూడా ఎక్కువగా పడుతుంది. దీంతో అక్రోట్ కాయల పప్పుల ధరలు పెరిగిపోయి, రైతుకి తగ్గ ఆదాయం రాదు. చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు రఫిక్ తన తాతగారు (ఆయన ఈ అక్రోట్ వ్యవసాయం చేసేవారు) కోతల సమయంలో అక్రోటు కాయలు చితక్కొట్టి, కొట్టీ చేతులు కందిపోయి ఎర్రగా మారి భోజనం చెయ్యటా నికి కూడా కష్టపడేవారు. అది గమనించిన రఫిక్ ఎప్పటికైనా ఈ సమస్యకి పరిష్కారం కనుగొనాలని అప్పటినుంచి ఆలోచన ప్రారంభించాడు.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

**పరిష్కారం/సాంకేతికత:**

అక్రోటు కాయలను యంత్రం పై భాగంలో ఏర్పాటు చేసిన పెద్ద బేసిన్/గరాటు లాంటి దానిలో వేస్తే అవి క్రిందకి జారి, యంత్రం క్రింద ఏర్పాటు చేసిన బేసిన్‌లో



పడతాయి. అక్కడ పప్పు ఒక పక్కగా, టెక్క ఇంకోవైపు, తొక్కలు వేరైపోయి వస్తాయి. ఈ యంత్రం నిమిషానికి 100 కాయలను ఒలచగలదు. అంటే దాదాపు గంటకి ఒక క్వింటాలు కాయలను పగలగొట్ట గలదు.

**సమాజంపై ప్రభావం:**

ఈ యంత్రం అక్రోటు కాయల తొక్కలను చిన్న చిన్న

ముక్కలుగా చేసి వేస్తుంది కనుక దాన్ని ఎరువుగా వాడవచ్చు, ఎందుకంటే భూమిలో (మట్టిలో) త్వరగా కలిసి పోతుంది. ఇతర యంత్రాలలో తొక్కలు పెద్దగా ఉండటంతో వాటిని నీటిలో నానబెట్టి మెత్తబడిన తరువాత చాలా రోజులకి ఎరువుగా ఉపయోగించుకోవాల్సి వచ్చేది. ఈ అక్రోటు కోతలు సంవత్సరంలో కేవలం 40 నుంచి 60 రోజులు మాత్రమే ఉంటుంది. కనుక అక్రోటు రైతులు త్వరగా తమ పని పూర్తి చేసుకొని సమయానికి మార్కెట్‌కు తమ అక్రోటు పప్పును తరలించే అవకాశం ఉంటుంది. ఖర్చులు చాలా వరకు తగ్గుతాయి కనుక రైతులకి అధికంగా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

**ప్రస్తుత పరిస్థితి:**

రఫిక్ ఈ యంత్రం రూపొందించటానికి దాదాపు 5 సంవత్సరాలు కష్టపడి పని చేసి, ఎంతో ఖర్చు స్వంతంగా పెట్టుకొన్నాడు. ఇప్పటికి 3 యంత్రాలను అమ్మాడు. ఈ యంత్రంలో 5% పప్పు మిగిలిపోతోంది, దానిని పూర్తిగా నివారించటానికి కృషి చేస్తున్నాడతను. వచ్చే పంట కాలంలో దానిని పరిష్కరిస్తానని చెప్పాడు. తనకి 'గియాన్' వారు సహాయ సహకారాలు అందిస్తున్నారని, తాను అనుకొన్నది సాధిస్తానని చెప్పాడు. ఈయన ఈ యంత్రం ఒక్కటే కాక, ఎన్నో గృహోపకరణాలు, వ్యవసాయానికి పనికి వచ్చే పనిముట్లు, చిన్న యంత్రాలు ఎన్నింటినో రూపొందించాడు.

**'క్రైమేరియా' రకం ఆపిల్ :**



**అబ్బాస్ గనీ,**

కుల్‌గామ్, జమ్ము & కాశ్మీర్.

**టెక్నాలజీ/ఇన్నోవేషన్ వివరాలు :**

అబ్బాస్ గనీ 'క్రిమేరియా ఆపిల్ రకం' మొక్కని 'క్రిమ్ సన్' ఆపిల్ రకం మొక్కను 'బల్గేరియా' రకంతో అంటు కట్టి రూపొందించాడు. ఈ రకం చెట్టు ఎక్కువ పండ్లను కాయటమే కాక, పండు పెద్ద పరిమాణంలో ఉంటుంది. రుచి, రంగు కూడా బల్గేరియా రకాల కన్నా ఎర్రగా, తియ్యగా ఉంటుంది. నాటిన 3 సంవత్సరాలలో పళ్ళను కాస్తుందీ చెట్టు. 5 సం. తరువాత ఒక్కో చెట్టు సుమారు 200 కిలోల కాయల దిగుబడిని ఇస్తుంది. క్రిమేరియా రకం ఆపిల్ చెట్టు ఏప్రిల్ నెలలో పూతకు వచ్చి, ఆగస్టు నెలలో కాపుకు వస్తుంది.

**సమాజంపై ప్రభావం:**

రంగు, రుచి, సైజు బాగా ఉండటంతో రైతులు ఈ రకం కాయలను కిలో 90–200 రూపాయల వరకు అమ్ముకోవచ్చు (అమ్మే ప్రదేశాన్ని బట్టి). ఇన్నోవేటర్ చెప్పినదాని ప్రకారం ఈ రకానికి ఎక్కువ చీడ పీడలు రావు. చాలా తక్కువ ప్రమాణంలో క్రిమి సంహారక మందులు వాడవలసి వస్తుంది. మంచి ఎరుపు



రంగు ఉండే ఈ ఆపిల్ పండ్లు అందంగా ఉండటమే కాక, మంచి రసంతో తియ్యగా ఉంటాయి. ఆ రంగు, ఆకర్షణల కారణంగా విందులలో దీనిని తినటానికే కాక అలంకరణగా కూడా వాడుతుంటారు.

**ప్రస్తుత పరిస్థితి:**

ఇన్నోవేటర్ తాను నివసించే జిల్లాలో ఎంతోమంది సాటి రైతులకి ఈ అంటు కట్టే పద్ధతిని నేర్పిస్తున్నాడు. ఈ రకం మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో కూడా పండించ వచ్చని పరీక్షలు/ప్రయోగాలు చేస్తున్నాడు. ఈయన పండ్లు, కూరగాయలు, ధాన్యాలు రిజిస్టర్ చేసే పిపివి & ఎఫ్ఆర్ఎ సంస్థలో తన 'క్రిమేరియా' రకం ఆపిల్‌ని రిజిస్టర్ చెయ్యాలని చూస్తున్నాడు. (పేటెంట్ లాంటి ప్రక్రియ) 'గ్యాన్' వారు ఈ పండ్లని కాశ్మీర్ బయటి ప్రదేశాలలో తియ్యటానికి సహాయం చేస్తున్నారు. 'అబ్బాస్ గనీ' త్వరలోనే దేశంలోని ఇన్నోవేటర్లందరి ఆలోచనతో తమ సమస్య పరిష్కారాలు చేసుకోవటానికి వీలుగా ఒక వెబ్‌సైట్‌ని రూపొందించాలని ఆలోచిస్తున్నాడు. దీనివలన సమస్య పరిష్కారాలే కాక, ఒకే విషయంపై అనేక మంది పనిచేసి అనవసరంగా కాలం, శ్రమ, డబ్బు వృధా చేసుకోకుండా నివారించవచ్చని అంటాడాయన.

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

### ఆటోమేటిక్ భోజనం తినిపించే పరికరం:

**నభజిత్ భరాలీ**, ధేమాజీ, అస్సాం.



**సమస్య :**

కాళ్ళు, చేతులు కదల్చలేని వారు, చేతులకి దెబ్బలు తగిలిన వారు, చేతులు అకస్మాత్తుగా పని చెయ్యకుండా పోయిన వారు, వికలాంగులు (చేతులు) తమంతట తాము భోజనం చెయ్యటం చాలా కష్టం. ఈ సమస్యని ఈ పరికరం కొంత వరకు పరిష్కరించ గలుతుంది.

**సాంకేతికత / పరికరం పనిచేసే తీరు:**

వీడియో కొరకు స్కాన్ చెయ్యండి

సెన్సార్‌ల సహాయంతో ఈ పరికరం 6 అంగుళాల దూరంలో వున్న ముఖాన్ని, నోటినీ పసిగట్ట గలుగుతుంది. పల్లెంలో కలిపి ఉంచిన అన్నాన్ని గేరు మీటర్‌ల సహాయంతో ఒ చెమ్చా తీసుకొని సెన్సార్‌ల సహాయంతో తినే వ్యక్తి నోటి వరకు తీసుకొని వెళుతుంది. 6 అంగుళాల పరిధి దూరంలో ఆగిపోతుంది. ఎంత త్వరగా చెంచాతో భోజనం కావాలో నియంత్రించే మీట ఏర్పాటు చెయ్యబడింది.

**సమాజంపై ప్రభావం:**

ఈ పరికరం పూర్తిగా ఆటోమేటిక్‌గా పని చేస్తుంది. దీనికి మీట (స్విచ్) తప్ప ఎటువంటి ఇతర పరికరాలు అవసరం లేదు. ఇది కరెంటు లేదా బ్యాటరీ పై పని చేస్తుంది. బజారులో లభించే ఇతర పరికరాల కంటే తాను తయారు చేసిన ఈ పరికరం చాలా తక్కువ ఖరీదులో ఎక్కడికైనా తీసుకొని వెళ్ళే వీలుందని, ఉపయోగించటం కూడా చాలా సులుని చెపుతున్నాడు ఇన్నోవేటర్.



**ప్రస్తుత పరిస్థితి:**

ఈ ఇన్నోవేటర్ దీనిని మరింత సమర్థవంతంగా పని చేసేలా మార్పులు చేర్పులు చేస్తున్నాననీ, ఎక్కువ సంఖ్యలో తయారు చేసి చవకగా అమ్మే ప్రయత్నం చేస్తాననీ చెప్తున్నాడు. తను చేసిన నమూనా పరికరంపై వచ్చిన అభిప్రాయాల ఆధారంగా దానిని మడత పెట్టేలా చిన్నగా చెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాననీ, రెండు మోటార్‌ల స్థానంలో ఒకే మోటారు వాడేలా చూస్తున్నానీ, తద్వారా ఖర్చు తగ్గించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇతను ఇంతకు ముందు వికలాంగులు వాడేలా ఎలక్ట్రిక్ చైర్ బైక్, మగ్గాలలో ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాన్ని కనుగొని ఎన్ఐఎఫ్ మరియు హనీబీ నెట్‌వర్క్ దృష్టికి వచ్చి సన్మానించ బడ్డాడు.


## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం



దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, సెల్ : 96528 01700.

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## ఆరోగ్యం కొరకు వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు



ఉమా మహేశ్వర రావు

ఈ సంవత్సరం అధికంగా వర్షాలు కురుస్తూ ఉండటం వల్ల వాతావరణ మార్పుల కారణంగా జ్వరాలు, జలుబులు, దగ్గు లాంటి సాధారణ జబ్బులు రావటం పరిపాటి. వీటి విషయంలో అనవసరంగా ఖంగారు పడకుండా మన ఇంట్లోనే లభించే కొన్ని వస్తువులతో కషాయాలు తయారు చేసి ఉంచుకున్నట్లయితే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ లాంటి జ్వరాల నుండి కూడా త్వరగా ఉపశమనం పొందవచ్చు.

ముఖ్యంగా వర్షాకాలం వీలైనంత వరకు వేడి వేడిగా వండిన పదార్థాలు, తేలిగ్గా అరిగే పదార్థాలు తినటం మంచిది. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలి. జ్వరం వచ్చినపుడు మనిషి ప్రేవులు బాగా గట్టిగా తయారవుతాయి. మళ్ళీ జ్వరం తగ్గిన వెంటనే మెత్తగా అవుతాయి. అందుకే వర్షాకాలంలో మన ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేసుకోవటం మంచిది. ఇడ్లీలు, గోధుమ రవ్వ, బియ్యం, బార్లీ, సగ్గుబియ్యం లాంటి పదార్థాలతో 'జావ'లు తయారు చేసుకుని తింటూ, త్రాగుతూ ఉండాలి. వీలైనంత వరకు వేపుళ్ళు, మాంసాహారాలు, కూల్ డ్రింక్స్ లాంటివి వాడకుండా కనీసం జ్వరం తగ్గేదాకా ఉంటే మంచిది.

జ్వరం వచ్చినపుడు ఆయుర్వేద మందుల షాపుల్లో, పచారీ కొట్టుల్లో దొరికే వస్తువుల ద్వారా జ్వరాలు తగ్గించుకునే మార్గాలు ఉన్నాయి. వీటిని పిల్లలు, పెద్దలు అందరూ ఈ కషాయాలు తాగి ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవచ్చు. కావలసిన వస్తువులు : 1. అతి మధురం, 2. అడ్డసరం, 3. తిప్పతీగ, 4. దుంప రాష్ట్రం, 5. వస, 6. ధనియాలు, 7. నేల వేము లను ఒక్కోటి 100 గ్రా. చొప్పున తీసుకోవాలి. వీటన్నిటిని బాగా మెత్తటి పొడిగా చేసుకుని ఒక గాజు సీసాలో భద్రపరచుకోవాలి. తర్వాత ఇంట్లో ఎవరికి జ్వరం వచ్చినా సరే ఒక గ్లాసు నీటిలో ఒక చెంచాడు ఈ మిశ్రమ పొడిని వేసి, ఆ నీటిని బాగా మరగబెట్టి, చల్లారిన తర్వాత త్రాగాలి. ఇలా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం చొప్పున ఒక వారం రోజులు సేవించినట్లయితే ఎటువంటి జ్వరాలైనా తగ్గిపోతాయి. చిన్న పిల్లలు ఈ కషాయం త్రాగలేరు అనుకుంటే కొద్దిగా తేనె తీసుకుని అందులో అర చెంచాడు పొడిని వేసి పిల్లల చేత నాకిస్తే చాలు. మరీ చిన్న పిల్లలు అయితే పావు చెంచా పొడిని తేనెలో వేసి నాకించాలి. ఇటి ఎటువంటి ప్రమాదం లేని కషాయం. ఇలా చేయటం వల్ల జ్వరం, జలుబు, దగ్గు, ఆయాసం అన్నీ తగ్గిపోతాయి.

మనం నిత్యం వాడే ఆహార పదార్థాలు, కూరగాయలలో విపరీతమైన రసాయనాలను వినియోగిస్తున్నారు. వాటినే మనం ఉపయోగించటం వల్ల మన శరీరాలు విపరీత మైన అనారోగ్యాలకు గురవుతున్నాయి. అలా శరీరంలో నుంచి బయటకు వెళ్ళే అనర్థమైన పదార్థాలను బయటకు పంపించేందుకు మనకు ఆయుర్వేదంలో ఎన్నో మార్గాలు ఉన్నాయి.

బూడిద గుమ్మడికాయను తీసుకుని, దాని తొక్కను, విత్తనాలను వేరు చేసి, కండ భాగాన్ని జ్యూస్‌గా చేసుకుని, అందులో కొద్దిగా నిమ్మరసం కలిపి 3 రోజులకు ఒకసారి తీసుకోవాలి. ఆ తర్వాత మళ్ళీ 3 రోజులకోసారి అనాస (పైనాపిల్) జ్యూస్ తీసుకోవాలి. తర్వాత 3 రోజులకొకసారి బొప్పాయి జ్యూస్ లేదా బొప్పాయి పండు ముక్కలు తీసుకోవాలి. ఇలా తీసుకున్నట్లయితే మన శరీరంలోని అనర్థాలను కలిగించే వ్యర్థాలన్నీ బయటకు వెళ్ళిపోతాయి. శరీరం అనారోగ్యానికి గురి కాకుండా చాలా వరకు కాపాడుకోవచ్చు.

మరో విషయం ఏమిటంటే చాలా మంది ఉదయం, సాయంత్రం నడక (వాకింగ్) చేస్తూ ఉంటారు. అలా చేసేవారు ఎక్కువగా బూట్లు, చెప్పులు వేసుకుని చేస్తూ ఉంటారు. వాకింగ్ చేయటం ఆరోగ్యానికి మంచిదే కానీ, ఇలా చెప్పులు, బూట్లతో కాకుండా పాదాలకు ఆచ్ఛాదన లేకుండా మట్టిపైన నడక సాగిస్తే కూడా శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకు వెళ్తాయి.

ప్రతిరోజు మూడు నాలుగు సార్లు నోట్లో కొద్దిగా నీరు తీసుకుని బాగా పుక్కిలించి ఉమ్మినా కూడా నోట్లో లాలాజలం బాగా తయారై, శరీరంలోని వ్యర్థాలన్నీ బయటకు వెళ్ళే అవకాశం బాగా ఉంటుంది. లాలాజలం శరీరంలో ఎక్కువగా తయారైతే ఇది మన శరీరానికి మంచి ఆంటీ బయాటిక్ లాగా పని చేస్తుంది. శరీరానికి రోగ నిరోధక శక్తిని ఇస్తుంది. శరీరంలోని గ్రంథులన్నీ సమానంగా పని చేస్తాయి. శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ●



తిప్పతీగ



దుంపరాష్ట్రము



వస



నేలవేము

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854**

# కదిలే దంతాలు, పళ్ల తీపుళ్ళకు ఆయుర్వేద చికిత్స


'వైద్య' కొమెర అంకారావు

**కదిలే దంతాలకు చికిత్స:**

కదిలే దంతాలు, పళ్ల తీపుళ్ళు, చిగుర్ల వాపు లాంటి ఎటువంటి దంత సమస్యల నివారణకు 'ఉత్తరేణి' చెట్టును వేర్లతో సహా పీకి వాటిని శుభ్రంగా కడిగి, ఆ వేర్లతో పళ్ళు తోముకున్నట్లయితే మంచి ఫలితం ఉంటుంది.


ఉత్తరేణి చెట్టు

'దుండిగ చెట్టు' (నేపాలం చెట్టు అని కూడా అంటారు) ఆకులను గిల్లినట్లయితే గంజిలాగా పాలు వస్తాయి. ఆ పాలను చూపుడు వేలిపైన వేసుకుని పండ్లు, చిగుళ్ళను ఒక పక్షం రోజుల పాటు తోమినట్లయితే మంచి ఫలితం ఉంటుంది. అందుకేమనకు "నేపాలం తీసుకుంటే భూపాళం అదురుతుంది" అన్న సామెత కూడా ఉంది. లేదా దుండిగ చెట్టు వేర్లతో సహా పీకి, వాటి వేర్లను బాగా కడిగినట్లయితే వాటి వేర్లు తెల్లగా ఉంటాయి. అందులో నుండి ఒక వేరు పుల్లను తీసుకుని ఆ పుల్ల కొసను కొద్దిగా కొరికి బ్రష్ లాగా తయారు చేసుకుని ఆ పుల్లతో పళ్ళు తోముకున్నా కూడామంచి ఫలితం ఉంటుంది. పళ్ళ నొప్పులు తగ్గుతాయి, చిగుళ్ళ నుండి రక్తం కారటం లాంటివి ఆగిపోతాయి.


పులిచేరు చెట్టు

జామ చెట్టు యొక్క లేత ఆకులు, పూత పిడికెడు సేకరించి, కొద్దిగా రాయితో నజిగిజిగా దంచి, ఒక గ్లాసు నీటిలో వేసి, ఆ నీరు సగం అయ్యే వరకు పొయ్యిపైన పెట్టి బాగా మరిగించి కషాయం తయారు చేసుకోవాలి. చల్లారిన తర్వాత ఆ కషాయాన్ని వడగట్టి, కొద్ది కొద్దిగా నోటిలో వేసుకుని 2-3 నిమిషాల పాటు నోరంతా బాగా పుక్కిలించి ఊస్తూ ఉండాలి. ఇలా ఉదయం సాయంత్రం 10-15 రోజుల పాటు చేసినట్లయితే దంతాలకు సంబంధించిన అన్ని రోగాలు నయమౌతాయి.

'పులిచేరు' (దీన్నే 'సిరాకాయల చెట్టు' అని కూడా అంటారు) ఇది పొదలాగా పెరుగుతూ ఉంటుంది. దీని కాయలు చిన్నగా బఠాని గింజంత పరిమాణంలో నలుపు వర్ణంలో ఉంటాయి. ఈ చెట్టు కొమ్మను తీసుకుని మనం సాధారణంగా వేప పుల్లతో పండ్లు తోముకున్నట్లు తోముకున్నా కూడా దంత రోగాలు నయమౌతాయి. తంగేడు చెట్టు పుల్లతో కూడా పళ్ళు తోముకోవచ్చు. ఈ రెండు చెట్ల పుల్లలు కాస్త వగరు వగరుగా ఉంటాయి.


దుండిగ చెట్టు

బొగ్గును తీసుకుని మెత్తటి పొడిగా దంచుకోవాలి. తరువాత నారింజ లేదా నిమ్మ కాయ తొక్కలను తీసుకుని వాటిని బాగా ఎండబెట్టి పొడి చేసుకోవాలి. ఆ తర్వాత బొగ్గు పొడిలో కొద్దిగా నారింజకాయ తొక్కల పొడి, కొద్దిగా పసుపు, కొద్దిగా ఉప్పు వేసి కలిపి ఒక మట్టి పాత్రలో వేసి ఉంచుకోవాలి. ఆ తరువాత ప్రతిరోజు ఉదయం ఈ పొడితో దంతాలను తోముకున్నట్లయితే మీ పళ్ళు గట్టిగా, ఆరోగ్యంగా ఉంటాయి. మార్కెట్‌లో లభించే టూత్ పేస్టులకన్నా ఇది వంద రెట్లు దంతాలకు ఆరోగ్యకరమైనది.

బొగ్గుతో పళ్ళు తోముకోవటం ఇష్టం లేనివాళ్ళు 'ఉత్తరేణి' చెట్టు సమూలంగా వేర్లతో సహా తీసుకుని, వాటిని చిన్న చిన్న ముక్కలుగా చేసి ఉంచుకొని, బాగా ఎండబెట్టి పొడి చేసుకోవాలి. అందులో కొద్దిగా పసుపు, కొద్దిగా ఉప్పు కలుపుకుని దంతాలు తోముకున్నా కూడా మంచి ఫలితం ఉంటుంది. ●

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రవే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర అంకారావు (జాజి), ఫోన్ : 9908411700

**వీర రాఘవ రెడ్డి గారికి,**

మీరు 'పల్లెసృజన' పత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చిన కొమెర అంకారావు (జాజి) గారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అటవీ మరియు పర్యావరణ శాఖ సలహాదారుడిగా నియమించడం ఎంతో ఆనందించ దగ్గ విషయం. పల్లెసృజనలో మీ చేతి వ్రాతకు చిక్కితే చాలు చెక్క సైతం శిల్పమవ్వనంతే! మీ కలం కళ్లే తెలియని ఓ ఖచ్చితమైన కొలమాన ఖడ్గమంతే! పల్లెలో వున్న దరిపల్లి రామయ్య 'పద్మశ్రీ' పొందాడు! కానల్లో తిరుగాడే కొమెర అంకారావు ఆంధ్ర ప్రభుత్వానికి సలహాదారుడు అయ్యాడు! కపటం తెలియని మీ కలం ఎల్లలు దాటి ఎదగాలి! స్వార్థం తెలియని 'పల్లెసృజన' సముచిత స్థానం పొందాలి! జై జవాన్! జై కిసాన్!

**– రమేష్,** హైదరాబాద్.

**రమేష్ గారు,**

మీ అభిమానానికి ధన్యవాదములు. మీలాంటి వారి ప్రోత్సాహమే 'పల్లెసృజన' 20 సంవత్సరాల ప్రయాణం సజావుగా సాగి, ఎంతోమంది మట్టిలోని మాణిక్యాలను విశ్వానికి పరిచయం చెయ్య గలిగింది. సామాన్యుడు అయిన ఇన్నోవేటర్ తలెత్తుకుని తిరిగేలా చేయగలిగింది.

**– వీర రాఘవ రెడ్డి,** పల్లెసృజన కుటుంబం.

**గణేశం గారికి నమస్కారం,**

మీరు గత సంచికలో వ్రాసిన 'ఎడిటోరియల్' లోని చివరలో ప్రస్తుతం తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు చేపట్ట దలచిన మానవ రహిత వ్యవసాయం అనే కార్యక్రమాని గుర్తు చేశారు. మీరు చెప్పినట్లుగా అది ఖచ్చితంగా భస్మాసుర హస్తంతో సమానం. వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు ఇలాంటి వ్యవసాయ వ్యతిరేక విధానాల పట్ల మొక్కు చూపటం చాలా బాధ కలిగిస్తోంది.

**– శివశంకర్,** చౌహాన్ & సివిఆర్ వ్యవసాయ వాట్సాప్ గ్రూపుల వ్యవస్థాపకుడు, హైదరాబాద్.

**వీరరాఘవ రెడ్డి గారికి,**

'పల్లెసృజన' 10 సంవత్సరాల నుండి రైతులవ్యవసాయ ఉత్పత్తులు గ్రామాల్లోనే విలువను జోడించి విక్రయించడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందటమే కాక, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) పెరుగుతుంది అని ఆంధ్ర ప్రభుత్వం గమనించడం రైతులకు ఎంతో ఆనంద దాయకమైన విషయం. దీన్ని ఆచరణలో పెట్టడానికి మనవంతు సూచనలు, సలహాలు వ్యవసాయ వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతాంగానికి విరివిగా చేర్చడం మన ధర్మము. మన సమూహంలో ఉన్నటువంటి ఆలోచన గల గౌరవ పెద్దలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల శాస్త్రవేత్తలు కూడా సభలు, సమావేశాల్లో అవసరమైనప్పుడు తప్పక ఈ వాదనను వినిపించాలి. రాజకీయాలకు అతీతంగా గ్రూపుల్లో ఈ చర్చ జరగవలసిన అవసరం ఎంతైనా ఉందని నా అభిప్రాయం. పల్లెసృజన వారికి ఒక రైతుగా నా అభినందనలు.

**– విజయ భాస్కర రెడ్డి,** తాడిపత్రి, అనంతపురం జిల్లా.

**విజయ భాస్కర రెడ్డి గారు,**

మీ సూచనకు ధన్యవాదములు. మీలాంటి రైతు బంధువులు, రైతు సమూహాలు సిద్ధమైతే చర్చను ఏర్పాటు చేయాలనే 'పల్లెసృజన' చాలా రోజుల నుంచి ఆహ్వానిస్తోంది. మీలాంటి వారు చొరవ తీసుకుని ఇటువంటి ఆరోగ్యకరమైన చర్చలు విరివిగా జరగాలని కోరుకుంటున్నాము.

**– వీరరాఘవ రెడ్డి,** పల్లెసృజన


## FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | |
|---|---|
| 1. Place of publication | : Ranga Reddy Dist |
| 2. Periodicity of its publication | : Bi-Monthly |
| 3. Printer's Name | : Narendra Grafix |
| Nationality | : Indian |
| Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. Publisher's Name | : P. Ganesham |
| Nationality | : Indian |
| Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. Editor's Name | : P. Ganesham |
| Nationality | : Indian |
| Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher

పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# పసుపు వండటం, పాలిష్ చేసే యంత్రాలు

## శ్రమ, ఖర్చు, సమయం అన్నీ తక్కువే



ఇన్నోవేటర్
**అల్లాడి ప్రభాకర్**
జగిత్యాల జిల్లా, తెలంగాణ

1. పసుపు పండించడం ఒక ఎత్తయితే, దాన్ని వండి పాలిష్ చేయటం ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న పని.
2. పసుపు వండటానికి టన్నుల కొద్దీ కలప అవసరం అవుతుంది. ఈ యంత్రం ద్వారా తక్కువ కలపతో, నాణ్యంగా వండవచ్చు.
3. పీకిన పసుపును ఒకే చోటుకు చేర్చి కుప్పగా పొయ్యాల్సిన అవసరం లేదు. అక్కడక్కడా కుప్పలు వేసుకుంటే చాలు. ఈ యంత్రాన్ని పొలంలో ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళి పసుపును ఎక్కడిది అక్కడే ఉడికించవచ్చు.
4. సాధారణంగా పసుపు వండేందుకు అయ్యే కూలీల ఖర్చులో పావు వంతు తక్కువ ఖర్చుతో ఎంతో నాణ్యంగా వండవచ్చు.
5. వండిన పసుపును ఒకచోటకు చేర్చి ఆరబెడితే చాలు.
6. పసుపు వండి, ఎండిన తర్వాత దాన్ని మార్కెట్లో విక్రయించాలంటే ఎంతో అందంగా కనబడేలా పాలిష్ చేయటం చాలా అవసరం.
7. పసుపును పాలిష్ చెయ్యటానికి చాలా మంది కూలీలు ఎంతో శ్రమపడి చేయాల్సి ఉంటుంది. ఇందుకు చాలా సమయం కూడా పడుతుంది.
8. ఈ సమస్యలన్నిటినీ పరిష్కరిస్తూ కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు పసుపును ఎంతో నాణ్యంగా పాలిష్ చెయ్యవచ్చు.
9. తక్కువ ఖర్చు, ఎక్కువ నాణ్యతతో పసుపుకు మంచి ధర లభించేలా చేస్తాయి ఈ పరికరాలు.









honeybee.org nifindia.org


వివరాలకు సంప్రదించండి

పల్లెసృజన

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

ఇన్నోవేషన్ల కొరకు సంప్రదించండి :
వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904
సుభాష్ చందర్, ఫోన్ : 9652801700


పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# వంగిన కరెంటు స్తంభాలను సరిచేసే పరికరం

## శ్రమ, ఖర్చు, సమయం అన్నీ తక్కువే



ఇన్నోవేటర్
**అల్లాడి ప్రభాకర్**
జగిత్యాల జిల్లా
తెలంగాణ

1. ఒకవైపు ఒరిగిపోయిన సిమెంటు కరెంటు స్తంభాలను చక్కగా నిలబెట్టాలంటే ఎంతో శ్రమ, ఖర్చు, సమయం అవసరం.
2. సాధారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 5-6 మంది బలమైన వ్యక్తులు, ఒక ట్రాక్టరు అవసరం, ఒక్క స్తంభం నిలబెట్టడానికి కనీసం 5-6 గంటల సమయం పడుతుంది.
3. ఈ సమస్యకు పరిష్కారంగా కేవలం 1-2 గంటల్లో ఇద్దరు లేదా ముగ్గురు సాధారణ వ్యక్తులు అలుపు లేకుండా స్తంభాన్ని నిటారుగా నిలబెట్టవచ్చు.
4. ట్రాక్టరు అవసరమే లేదు, ఈ పరికరాన్ని కేవలం మోటార్ సైకిల్ పైన ఎక్కడికైనా తీసుకు వెళ్ళవచ్చు.
5. ఈ పనికి అవసరమైన రెండు ప్రత్యేకమైన చిన్న పనిముట్లు కూడా తయారు చేయబడ్డాయి.
6. ఒక్క రోజులో కనీసం 4-5 స్తంభాలను నిటారుగా నిలబెట్టవచ్చు.
7. పంట పొలాల్లో అయినా సరే రైతుకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పని పూర్తి చేయవచ్చు.
8. విద్యుత్ శాఖకు ఎంతో ఊరట, సమయం, ఖర్చు తక్కువ.
9. విద్యుత్ శాఖకు లక్షలాది రూపాయలను ఆదా చేసే పరికరం.
10. స్తంభాలను త్వరగా సరిచేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.








honeybee.org nifindia.org


వివరాలకు సంప్రదించండి

పల్లెసృజన

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

ఇన్నోవేషన్ల కొరకు సంప్రదించండి :
వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904
సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly July-Aug 2025 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**

